


NARLA
D.P.R.I.
Acc. No.
894.8273
BHA

ci

AOUA103B1[illegible]

# వేకువ

[ నవలిక ]

పూజ్యులు - గురు తుల్యులు
శ్రీ [illegible] శాస్త్రి గారికి -
[illegible]
- సంపాదకుడు

రావూరి భరద్వాజ

V.R. NARLA MEMORIAL LIBRARY ★
V.R.NARLA
D.P.R.I.
Acc. No.

CLS

సి. ఎల్. ఎస్. బుక్ షాప్
స్టేషన్ రోడ్, హైదరాబాద్ 500001

THE CHRISTIAN LITERATURE SOCIETY
POST BOX 501, PARK TOWN, MADRAS 600003

*Telugu Publications*:
C.L.S. BOOKSHOP
STATION ROAD, HYDERABAD 500001

T
894·8273
BHA

© AUTHOR

*First printed*, 1973

PRINTED AT THE DIOCESAN PRESS, MADRAS—1973. A5771

ADUA103B110

మిత్రులు

శ్రీ జి. వి. కృష్ణారెడ్డి

గారికి

V.R. NARLA MEMORIAL LIBRARY
V.R.NARLA
D.P.R I.
Acc. No 11735

Dr. B. R. AMBEDKAR
OPEN UNIVERSITY
LIBRARY
HYDERABAD-500 033

# పరిచయం . . .

సమాజంలో అసమానతలు సమిసి సమసమాజం ఆవిర్భూతం కావాలనేది మన ఆకాంక్ష. అందుకు దోహదమిచ్చే సాహిత్యాన్ని ప్రచురించాలనేది మా ఆశయం. ఈ ఆశయసిద్ధికి వేగు చుక్క వంటిది, ఈ 'వేకువ'. ఈ నవలను ప్రచురించే తరుణం మాకు లభించడం నిజానికి మా అదృష్టం. సుప్రసిద్ధ రచయిత శ్రీ రావూరి భరద్వాజగారు, ఈ విధంగా మాతో సహకరించినందుకు వారి కి మా ధన్యవాదాలు.

ఏనాటికైనా ఈ అసమానత్వాలు తొలగిపోయి, సామాన్యుని జీవితంలో చంద్రోదయం కలిగితీరుతుంది – అనే రచయిత ఆశయానికి అంజలి ఘటిస్తున్నాం.

పాఠకుల్లో సంచలనాన్ని కలిగించే, ఈ నవల అభ్యుదయవాదుల్ని ముందుకు నడిపిస్తుందనే ఆశతో దీన్ని మీకందిస్తున్నాం.

దాస్ బాబు,

సంపాదకుడు.

DR. B.R AMBEDKAR OPEN UNIVERSITY
UNIVERSITY - LIBRARY
N11735

\\/

Vie

# వేకువ

కొండమీదినుండి రయ్యిన గాలివీస్తూ ఉంది. ఆ గాలి ఉదుటకు చిటికేశ్వరి చెట్టు కొమ్మలు ఊగిసలాడి పోతున్నాయి. సన్నని ఆకులు, వాన జల్లులాగా, తలమీదా తనచట్టూ పడుతూ ఉంటే, నారాయణకు చిత్రంగా ఉంది.

మంచంమీద అటూ ఇటూ పొర్లాడు. పాత మంచం 'కిర్రు' మని మూలిగింది. ఆ మంచం తనకు చిన్నతనంనుండీ తెలుసు. ఒకప్పుడు ఆ మంచాన్ని గోడ కానించి, దాని మీదుగా ఎక్కి, గోడలకు పటాలు తగిలించాడు తను. నాన్న చూరులో దోపిన వసికొయ్యలు, చిక్కాలు, మెడపట్టెళ్ళు, తనే తీసేవాడు. నడుం వారు బిగిసిపోకుండా, మెత్తపడేందుకు, నాన్న దానికి ఆముదం పట్టించడం తనకింకా బాగా జ్ఞాపకం ఉన్నది. ఒక చివర తాడుకట్టి, ఆ తాడును, రావిచెట్టు వేరుకు బిగించేవాడు నాన్న. రెండో కొనను తను లాగి పట్టుకొనేవాడు. తన చెల్లెలేమో, ఆముదం పిడతను పట్టుకొనేది. చేతినిండా జిడ్డవుతుందన్న భయంలేకుండా, నడుంవారుకు ఆముదం పూసి నీడన ఆరబెట్టేవాడు. ఆ వారునిండా చినచిన్న అద్దాలు కుట్టి ఉండేవి. వాటిల్లో తను ముఖం చూసుకొనేవాడు. నాన్న లేనప్పుడు, ఆ వారును చెట్టుకిందికి తీసుకొచ్చేవాడు తను. అద్దాల్లో చిన్నగా కనిపించే చెట్లను, కొండనూ చూసి గంతు లేసేవాడు.

ఆ రోజుల్లో తమకో ఆవుకూడా ఉండేది. దాని వంటి నిండా ఎర్రని మచ్చలు — డాగులు ఉండేవి. అదంటే తన కెంతో ఇష్టం. దాని కొమ్ములు వెనక్కు వాలి, చెవులకిందికి తిరిగి ఉండేవి. కొమ్ములు కదిపితే, ఇట్టే ఊగిసలాడుతూ ఉండేవి. అలా ఎందుకు కదలాడేవో చాలా రోజులుదాకా తనకు తెలీదు.

తనకింకా బాగా జ్ఞాపకం ఉన్నది. ఓ రోజున తనకు హఠాత్తుగా మెలకువ వచ్చింది. అమ్మ దీపంబుడ్డి పెద్దదిచేసి, హడావుడిగా అటూ ఇటూ తిరుగుతున్నది. నాన్న, మోకాళ్ల దాకా పంచెను ఎగ్గట్టాడు. తలగుడ్డతీసి మంచంమీదికి విసిరే శాడు. మచ్చలావు గుంజదగ్గర అటూ ఇటూ తిరుగు తున్నది. దాని ముందు, తవుడు జొన్నలు కలిపిపెట్టారు. వాటిని మూ చూసిందేతప్ప తినలేదు. మణుగుచట్టంమీద వెచ్చని ఆముదం రాస్తున్నది అమ్మ.

ఇదంతా ఎందుకు చేస్తున్నారో తనకు తెలీదు. అడుగుదా మనిపించింది. కాని భయంవేసి అడుగలేదు. తను కాస్సేపు అటూ ఇటూ తిరిగాడు. కళ్లల్లో ఇసకపోసుకొన్నట్లుగా గరగర లాడుతున్నాయి. అటూ ఇటూ చూసి వెళ్లి, చెల్లెలి మంచంమీదనే పడుకొన్నాడు.

అమ్మ తట్టిలేపింది. అప్పటికి బారెడు పొద్దెక్కింది. అప్పటికే చెల్లెలు 'జున్నుపాలు జున్నుపాలు' అంటూ హంగామా చేస్తున్నది. అంతా అయోమయంగా ఉంది. తను గుడిసెలో నుండి బయటికొచ్చాడు. మెత్తకాళ్లతో నిలబడలేకుండా ఉన్న లేగను, నాన్న నించోబెడుతున్నాడు. అది ఊగుతూ, తూగుతూ పడబోయినప్పుడల్లా—

'యహ! ఉండరా పిచ్చిసన్నాసి' అని బుజ్జగిస్తున్నాడు నాన్న. తనకు జున్నుపాలంటే చాలా ఇష్టం. ఆ సంగతి అమ్మకు తెలుసు. అందుకని చెల్లెలు చూడకుండా, తొర్రిపిడతలో ఇంకాస్త జున్ను వేసి, గుమ్మెలో ఉంచేది. జున్నుపాలు, మామూలు పాలు చూడడానికి ఒక్కలాగే ఉంటాయిగదా; మొదటి 4, 5 రోజుల పాలూ ఎందుకు గడ్డకడతాయో మిగిలినవి ఎందుకు మీగడ కడతాయో తనకు తెలిసేదికాదు.

నాన్నకేమో తనకు చదువు చెప్పించాలనే ఉండేది. కాని చదువు ఎవరుట చెబుతారు? ఊరుబడి చూదామా, ఊరికి ఆ చివర ఉన్నది. అదీగాక — అక్కడ, తనలాంటివారిని చేరనివ్వరుట. ఆ బడి బాగా డబ్బున్నవాళ్ళకేనట. పెద్ద కులం వాళ్ళకేనట. తమలాంటివాళ్లు, అక్కడ చదువుకొంటా నంటే, ఎవ్వరూ ఆటంకం చెప్పకూడదని, సర్కారువారి ఆర్డర్లు ఉన్నాయట. అయినా అవేవీ అమల్లో లేవుట. ఆర్డర్లను అమలు చేయవలసినవాళ్లు కూడా పెద్దవాళ్లే అయితే ఇక చెప్పుకునేది ఎవరితో? చెప్పినా వినే దిక్కు ఉండేందుకే వీల్లేదుట. అసలీగొడవలేమీ తనకు అప్పట్లో తెలిసేవి కావు. ఉన్న గంజో గటకో ఇంత తాగి, రేలాకుచుట్టలు పీకుతూ, గంటలమ్మ చెట్టుకింద, పెద్దలందరూ కూచుని మాట్లాడుకొంటు న్నప్పుడు, తనూ కూచునేవాడు. తనకు కొన్ని తెలిసేవి, కొన్ని తెలిసేవి కావు.

ఒకసారి—పెదపరిమిలో వెంకన్న తాతను చావబాదారుట. దాన్నిగురించి అంతా అనుకొన్నారు. వెంకన్న తాత వొంటి నిండా వాతలేనూ. మోకాళ్లమీదా, మోచేతులమీదా,

కీళ్లు ఊడేలాగా బాదారుట. వంటినిండా వాతలు పడటమంటే తనకు తెలుసు. కాని, కీళ్లు ఊడటమంటే ఏమిటి? ఈ విషయమే, తను అమ్మను అడిగాడు.

'నీకన్నీ యివరాలు గావాల్రా! ఎందుకురా అయ్యన్నీ?' అని గసురుకొన్నది అమ్మ.

'చెప్పవే అమ్మా! సెట్టుకాడా — అయ్యావాళ్లూ అనుకుంటా ఉండారే.'

'అసలా ముచ్చటెందుకొచ్చిందిరా నారిగా?' అన్నది అమ్మ గారాబంగా.

'ఎంకయ్య తాతను పెదపరిమిలో కొట్టారంటే అమ్మా! తాతయ్యకు వొంటినిండా వాతలు పడినయ్యంటనే' అన్నాడు తను భయం భయంగా.

'ఎట్టుండదిరా ఇప్పుడు?' అన్నది అమ్మ! ఆమె కన్నుల్లో చావుభయం దోబూచులాడింది.

'నాకు తెలవదే.'

'రేప్పొద్దుటాల సూసన్నారావాల్రా నారిగా.'

'నేనూ వత్తానే అమ్మా!!' అని అమ్మకొంగు పట్టుకుగుంజాడు తను.

'అట్టాగేలేరా! ఇక పడుకో!' అని సర్దింది అమ్మ.

'అమ్మా! అమ్మా!!' అన్నాడు కాస్సేపాగి తను.

'ఏంటిరా?'

'తాతయ్యను ఎవరు కొట్టారే?' అదీ తన అనుమానం!

'నువ్వే అన్నావుగందరా—ఆ ఊరోల్లు కొట్టారని?'

'ఎందుకు కొట్టారే అమ్మా?' అదీ తనను వేధిస్తున్న సమస్య.

'అల్లు పెద్దోల్లు బాబూ! మనసమంటోల్లని అట్టాగే కొడ తారు.'

'అయ్య నీకన్నా పెద్దోడేగందా...నిన్ను కొట్టడేమిటే?' అన్నాడు తను.

'ఎందుకురా నీకిసుమంటే యవారాలు? పోయి పడుకో రాదూ?' అని నవ్వుతూనే గసిరింది అమ్మ.

'ఊఁ ఊఁ ఊఁ చెప్పవే.'

'నాకూ సరిగ్గా తెలవదురా నారయ్యా! బగమంతుదు, కొంతమందినేమో, గొప్పవాల్ల కడుపున పుట్టిత్తాడంటరా..., ఇంకొంత మందినేమో మనకుమల్లే — అంటరానివాల్లంగా పుట్టిత్తాడంటరా...మనసమఁటోల్లు, ఊరికి దూరంగా ఉండా లంట. అందరూ నడిసే తోవలో మనం నడవగూడదంట. అందరూ కూసునే సోట మనం కూసోకూడదంట. అందరు తాగే నీల్లు మనం తాగ్గూడదంట. మరేమో...అందరికి మల్లే మనం సదువుకోకూడదంట—' ఇంకా ఏదో అనబోతున్నది అమ్మ. మధ్యలోనే—

'అది సరేలేవే అమ్మా! తాతయ్యను ఎందుక్కొట్టారంటే సెప్పవేందే?' అని తుంచేశాడు.

'తాతయ్య ఊర్లోనంట, బజార్న నడిసాడేమోరా... దొరలు ఊరికే కొట్టరుగందరా' అన్నది అమ్మ అలా నడవడమే తప్పయినట్లుగా.

'మరే అమ్మా! నాకు తెలవక అడుగుతానే...ఆల్లు మన బజార్లో నడిశారనుకోవే! మనంకూడా ఆరిని అట్టాగే కొట్టచ్చునా అమ్మా?' అన్నాడు తను.

'చహ తిక్కనాగన్నా! ఏంటిరా నీ మాటలు? ఎవరన్నా వింటే నీకు పిచ్చిపట్టిం దనుకోరంటరా మలప సన్నాసి! అనుమంటి దొరలు, మన గూడెంలోకి ఎందుకు వత్తార్రా? ఆల్ల కేదన్నా పనుంటే, గట్టుకాడ నిలబడి పిలుత్తారు. నిన్న నువ్వ చూశావుగందా — అప్పయ్య దొరగారు మీ అయ్యను పిలిసింది.?'

'అవునే అమ్మా! ఆయనగారి కిర్రు సెప్పులు ఎంత బాగా ఉన్నయ్యే! నడుత్తావుంటే నాసామి రంగా 'కిర్రో కిర్రు. కిర్రో కిర్రు' ఏం మోతగా ఉందిలే. అమ్మా అమ్మా! మరేమోనే, ఆయనగారి సేతికి బంగారం కడియాలున్నాయే. అయ్యేమో ఎండకు ఏం మెరుత్తా వున్నాయనుకున్నావ్?' అన్నాడు తను, ఆ మెరుపులను జ్ఞాపకం చేసుకుంటూ.

'చేతులకు కడియాలేంటిరా పిచ్చోడా! ఆటిని 'మురుగులు' అంటార్రా. ఇక పడుకోరాదూ?' అన్నది అమ్మ ఆవలిస్తూ.

'పడుకొంటాలేవే సాదా!' అన్నాడు తను విసుక్కొంటూ.

'నీకు నిదరపావలు సచ్చాయా ఏందిరా?'

'అప్పయ్య దొరగారు మన గూడెంలోకి ఎందుకు రారే?' అన్నాడు తను.

'అబ్బబ్బబ్బా నాకు తెలవదురా! పడుకో!' అన్నది అమ్మ, ఈసారి మరింత గట్టిగా.

'ముందీ సంగతి చెప్పవే పడుకొంటా.'

'లోనికి వత్తే—ఆల్లు మైలపడతా ర్రా. అందుకని దూరంగా ఉంటారు. ఆల్లందరూ పెద్దోల్లు. మనం తక్కువ కులపోల్లం.'

అదీ అమ్మకు తెలిసిన కారణం!

'అంటే ఏంటే అమ్మా?' అన్నాడు తను, అప్పటికింకా, కులాల గొడవ తెలీక.

'సెప్తా ఉంటే నీగ్గాదురా! నాకు నీదరొత్తా ఉంది. మల్లా తెల్లారగట్ల లేసి, పిట్టకాయిలికి పోవాలి' అని తప్పుకొన్నది అమ్మ.

'నేనూ పొలంకాడికొత్తానమ్మా! ఊసబియ్యం తింటానే!'

'ఊఁ. ఇక పలకరియ్య మాకరా!' అని నిండా ముసుగు కప్పుకొన్నది అమ్మ.

'ఇందాక నువ్వేందో అన్నావు నూడవే—అదేనే—కులమని —కులమంటే ఏమిటే అమ్మా?'

'నాకు తెలవదు పోరా'

అంటూ అమ్మ ముసుగు సవరించుకొని పడుకొంది. ఆ రాత్రి చాలాసేపు వరకు నిద్రపట్టలేదు. ఊళ్లో బజార్న నడిసి నందుకు వెంకయ్య తాతను కొట్టారా? కుక్కలు, పిల్లులు, పశువులు, పందులుకూడా బజార్న నడుస్తున్నాయి. అప్పుడు తప్పులేదు. తోటిమనిషి నడిస్తేనే తప్పా? అయితే ఈ ఆలోచనలు, యీ ప్రశ్నలు, తనకు ఆనాడే కలిగాయో లేదో, తనకిప్పుడు స్పష్టంగా జ్ఞాపకంలేదు. తనకు గుర్తున్నదల్లా వొక్కటే సంగతి; పెద్ద దొరల పిల్లల్లాగా తను బడికిపోవడానికి లేదు. వారికి మల్లే తను చదువుకోవడానికి లేదు. వారికి మల్లే,

తనుకూడా మంచి మంచి లాగులూ, చొక్కాలూ వేసుకోవడానికి లేదు.

*　　*　　*

అమ్మతోపాటు తనుకూడా అప్పుడప్పుడు పొలం పోతూ ఉండేవాడు. జొన్న సుంకు పట్టినప్పుడు చూస్తూ ఉంటే— ఎంత అందంగా ఉంటుంది...జొన్నకర్రల్ని పట్టుకొని తను సుంకునంతా చొక్కాలోనికి రాల్చుకొనేవాడు. నలుసులంత సన్నని సుంకులు. పసుపుపచ్చగా, మెత్తగా ఉండేవి. అలా రాల్చకూడదని అమ్మ కేకలేస్తూ ఉండేది. పొలాలమీదబడి, తను ఊచబియ్యం కొట్టుకొనేవాడు. ఊచబియ్యం ఎంత రుచిగా ఉంటాయో! అప్పుడప్పుడు పిచికలు చేసుకొనికూడా తను తినేవాడు. ఉప్పేసిన జొన్నగుగ్గిళ్లు రెండు చారెళ్లు తిని కుండలో నీళ్లు తాగి, మంచెమీద కూచుంటే సరదాగా ఉండేది!

తూనీగల్ని పట్టుకోవడమంటే, తనకు ఇష్టంగా ఉండేది. వాటిల్లు బంగారంగానూ; అవి చప్పున దొరకనే దొరకవు. పొలాల్లోని తూనీగలు, లావుగా పెద్దగా ఉండేవి. వాటిని పట్టుకొని తోకకు దారాలుకట్టి, తను ఆడుకొంటూ ఉండేవాడు. ఒక్కోసారి చినచిన్న మట్టిబెడ్డలను అరచేతిలో పెట్టుకొని...

‘పోలీపోలీ మీ అత్తొచ్చిందే కుండను పట్టుకోవే—’

అంటే చాలు—తూనీగ కాళ్లతో మట్టిబెడ్డను గట్టిగా పట్టుకొనేది. కొన్ని తూనీగల్ని ఇంటిదాకా తెచ్చి తను చెల్లెలికూడా ఇచ్చేవాడు. ఆ రోజుల్లో అల్లేరు శనగ తెగ

వండేది. తను మండల్ని పీకి, పచ్చికాయలు తింటూంటే అమ్మ కాల్చుకొని తినమనేది. బండోళ్ల బీట్లోకి పోయి, తను వంట లేరుకొచ్చేవాడు. పుల్లా పుడక, చిదుగుబొదుగు పోగు చేసేవాడు. కుంట పక్కన మంటచేసి, కరపచ్చికాయల్ని ఎచ్చీపచ్చీగా నిప్పుల్లో పాలకరించి ఆరం గారంగా ఊదుకుంటూ తింటూ ఉంటే, ప్రాణానికి హాయి హాయి అనిపించేది. అదో సుఖం! అదో ఆనందం! ఉన్నవాళ్లు మేడల్లో మిద్దెల్లో కులుకుతూ ఉంటే, తనూ తనలాంటివాళ్లూ, పొలాల్లో పంటల మధ్యా తిరుగులాడేవారు. అదేదో పండగ. ఆ పండక్కి, అమ్మ తనకు గోవతాడు చేయించింది. చెల్లెలికి అంటుపోగులు చేయించింది. గడ్డిమూటలమ్మి అమ్మ డబ్బులు కూడబెట్టిందట. ఆ రోజున తనెంత మురిసిపోయాడో ఇప్పుడెలా చెప్పడం? తన సావాసగాళ్లందరకూ ఆ గోవతాడును చూపించాడు తను. పెదకాపుగారు వాళ్ల అబ్బాయికి బిళ్లల మొలతాడు చేయించాడుట. వారమ్మాయికి అడ్డిగలు చేయించాడట. ఉన్న మహారాజులు గనక, ఏమన్నా చేయించుకొంటారు; తమకుమాత్రం లోటేముంది గనక?

'అన్నిరోజులూ ఒక్కలాగే ఉంటే ఎంత బావుండును' అనుకొంటాంగానీ, నిజానికి, అలాంటి గానుగెద్దు జీవితాన్ని భరించగలమా? భరించలేమనే అనిపిస్తుంది. ఇబ్బందులేవో, రావాలి. అనుకోని సంఘటనలు జరగాలి. వాటితో ఉక్కిరి బిక్కిరయిపోవాలి. సుడిగుండంలో చిక్కడిపోయినట్లుగా, దిక్కుతోచక, గింగిరాలు తిరగాలి. ప్రాణాలన్నింటినీ ప్రోది చేసికొని, ఆ వలయంనుండి వెలుపలికి రావాలి. అలా వచ్చాక, అలసిపోయి, నేలమీద వెల్లకిలా పడుకొన్నాక,

మనసులో, లోలోపల ఎక్కడో ఆనంద రేఖ మసకలాడుతుంది. ఆ తృప్తి, ఆనందం అనుభవించవలసిందేతప్ప—చెప్పడానికిలేదు.

ఆ రోజుల్లో—

తనొక్కడేనేమిటి? తన ఈడువాళ్ళంతా, గాలికి తిరుగుతూ ఉండేవారు. కాస్త కాలూ చేయీ వచ్చినవాళ్ళు, పొలాలకు పోతుండేవారు. కొంతమంది జంగిలిగొడ్లు కాయడానికి పోతుండేవారు. ఇంకొంతమంది గుడిశలదగ్గరే ఉండిపోయే వారు. గుడిశలకు కాపలాకాస్తూ ఉండేవారు. పెద్దవాళ్ళ భయంగానీ—ఆలోచిస్తూ ఉంటే, ఇప్పుడు అనిపిస్తున్నది తనకు; ఆ గుడిశల్లో, మరొకరు దోచుకోవడానికైనా ఏమున్నదా—అని.

గుడిశల చుట్టూ బురద గుంటలు. వాటిల్లో తెట్టెలు కట్టిన దోమలు. వాటిని తోలుకొంటూ అటూ ఇటూ పొర్లాడే పందులు. చాలా గుడిశల్లో కోళ్ళుకూడా ఉండేవి. కోడిపిల్లలు ఎంత ముద్దొస్తాయో! నున్నగా, మెత్తగా, పట్టుకోడానికి భయం వేసేటంత సున్నితంగా ఉంటాయి. అరచేతిలో కోడిపిల్ల నుంచుకొని, దాని వీపుమీద ఉఫ్ మని ఊదితే, పట్టునూగులాగా, వెంట్రుకలన్నీ పక్కలకు లోగిపోయి, నిగనిగలాడే చర్మం కనిపిస్తుంది. అమ్మ—నూకలే వేసేది వాటికి! అమ్మ చూడకుండా తను, జొన్న బియ్యం వరిగ బియ్యంకూడా వేసేవాడు. తనమీాద పంతంకొద్దీ చెల్లెలుకూడా గుప్పెళ్లతో గింజలేస్తే, అమ్మ ముక్క చీవాట్లూ వేస్తూ ఉండేది. దానికి తనంటే కోపం, గుర్రు. తను చేసిన ప్రతి పనీ, అది కూడా చేస్తా ననేది.

ఒకసారి తను కోతికొమ్మచ్చు లాడుకొంటున్నాడు. సూరిగాడికీ తనకూ పందెం. తనెక్కడి కెడితే వాడూ అక్కడికే వచ్చేవాడు. ఆఖరుకు, తను పంగలకొమ్మమీదికి ఎగబాకాడు. ఆ కొమ్మనిండా వొకటే గండుచీమలు! తనైతే తప్పుకొన్నాడు గానీ, సూరిగాణ్ని కండ లూడేలాగా కరిచేశాయి. వాడు లబోమంటూ వొకటే గోల! అయినా చెట్టు దిగండే! తను కొమ్మమీదినుండి, ఊడలమీదుగా కిందికి జారాడు. ఆ దెబ్బతో సూరిగాడు గో(హూ)విందా.

* * *

ఒకసారి తనూ, నాన్నా పొలంనుండి వస్తున్నారు. మధ్యలోనే, మబ్బులు మసకేసి పోయాయి. కామంచి చెట్లనిండా సీతాకోక చిలుకలే. తుగిడీలు తుగిడీలుగా తూనీగలు. నాన్నొక్కడే అయితే, ఈపాటికి గూడెం చేరుకొనేవాడే, వెంట తనున్నాడు. తను వేగిరంగా నడవలేడు. మెల్లిగా నడిస్తే తడసిపోక తప్పదు.

అసలంత ఆలస్యం కాకనేపోను. నిన్న ననంగా బీట్లోకి తోలిన బోడావు అంతూ పంతూ లేదు. రాత్రల్లా, అమ్మా నాన్నా దానికోసం కలవరిస్తూనే ఉన్నారు. దాంతోబాటు బుజ్జాయికూడా ఉంది. బందిలి దొడ్లో పడ్డదేమో ననుకొంటే అదీ కాదు. ఎవరన్నా తోలుకుపోయా రనుకోవడానికీ, అటువంటిది అంతకుముం దెప్పుడూ జరగలేదు. నాన్న ఏదో ఇంత ఎంగిలిపడ్డాడు గానీ, అమ్మ గంగన్నా ముట్టలేదు. చీకటితో లేచి, అమ్మ గట్టుపక్కకు పోయింది. తనూ, నాన్నా బాడవ పొలాలవేపు కొచ్చారు. ఆ సమయాన నాన్నను పలకరించ

డానికే తనకు భయంవేసింది. పారబోయిన చుట్ట, చెవులో దోపుకొని, గజానికో అడుగుచొప్పున వేస్తూ ఉంటే, తను గునుకు పరుగు లంకించుకొనేవాడు. మధ్య మధ్య పిల్లి పెసర కాయలు తెంపుకొని తింటూ ఉండేవాడు.

ఏదో సామెత చెబుతారే — అలాగయింది ఆ రోజున. పొద్దింకా రెండుబారలున్నదనగా సావళ్లలో కనిపించింది ఆవు. అది గట్టునే ఉంది. నీరసంగా పడుకొని, ముట్టె ముందుకు సాచి గోతిలోకి చూస్తూ ఉంది. తమను చూస్తూనే లేచింది. మరి బుజ్జాయి ఏమయినట్లు?

అది పాపం బుడుగులో కూరుకు పోయింది. చిప్పెరగడ్డి ఉప్పగా ఉంటుందిగదా ... ఆశకొద్దీ బుజ్జిగాడు బుడుగులోకి దిగి ఉంటాడు. ఇంకేముంది? గొంతుదాకా కూరుకుపోయాడు. బుజ్జిగాడు చిన్నవాడు గదా పాపం! అందులోంచి రాలేక పోయాడు. బుజ్జిగాణ్ని వొదిలి బోడావూ రాలేకపోయింది. ఎలా వస్తుంది? తనను వొదిలిపెట్టి అమ్మ వెడుతుందా? అంత దాకా దేనికి? ఆ మధ్య ఎవరో వచ్చి, చెరువుకట్ట దగ్గర బుర్ర కథ చెప్పారు. తనూ చెల్లాయి అమ్మ దూరంగా దీపాల దిబ్బ మీద కూచున్నారు. వాళ్లేమో అందర్నీ దగ్గరకు రమ్మనే అన్నారు. మనలో మనకు భేదాలు పనికిరావన్నాడు. మహాత్ముడు బోధించినట్లుగా చేయమన్నాడు. అంటరానివాళ్లు కూడా మన సోదరులే నన్నాడు. అయితేనేం — వాళ్లలో కలవడానికి గూడెం వారికి భయమే! కలుపుకోడానికి వారికి భయమో కాదో తనకు అప్పట్లో తెలీదు.

చెల్లాయి ఇంటికిపోదా మంటుంది. తనకింకా ఆ కథ వినాలనే ఉంది. తను, అమ్మను వెళ్ళిపొమ్మన్నాడు. తోపులో గుండా తను ఇంటికొస్తా నన్నాడు. అమ్మ వినలేదు. చీకట్లో తను దడుసుకొంటానేమోనని అమ్మ భయం. తనతో బాటే కునుకులాడుతూ కూచున్నది పాపం. అవునా? మరి బోడావు రాలేదనుకోవడం ఏం భావ్యంగా ఉంటుంది? నాన్న పంచె ఎగ గట్టుకొని వొడ్డునే కూచున్నాడు. బుజ్జిగాడి మెడకాయ వాలేసుకొని, వొక్క వూపుతో వొడ్డుకులాగి పడేశాడు. కుంటదాకా మోసుకొచ్చాడు. నాన్న దోసిలితో, బుజ్జిగాడి మీద నీళ్లు చిమ్ముతూ ఉంటే, తను బురదనంతా కడిగేశాడు. దవ్వగడ్డిని, బుజ్జిగాడి నోటికందించాడు తను. ఆవురావురు మంటూ తిన్నది పాపం!

ఆ పట్టు పట్టు నాలుగు రోజులపాటు ముసురుపట్టింది. దేవుడి పుణ్యాన ఇంకా గాలిలేదు. ఉన్నట్లయితే గూడెం గూడెమంతా ఎగిరిపోయి ఉండేది. బయటికి పోవడానికి లేదు. ఇల్లంతా నిమ్మెక్కి బురుకు బురుకు మంటున్నది. లచ్చిందేవి కోళ్లు వానకు తడిసి చచ్చిపోయాయిట. బోడావుకు కుడితి తప్ప; పాపం ఆ నాలుగు రోజులూ మేత లేనేలేదు. బుజి గాణ్ని ఇంట్లోనే కట్టేశాడు నాన్న.

తనకింకా బాగా జ్ఞాపకం ఉంది. ఆ ముసురు వెలిసిన తరువాతనే సాల్మన్ తమ గూడేనికొచ్చాడు. సాల్మన్ ఎంత శుభ్రంగా ఉంటాడని! తెల్ల గౌను -- వొదులొదులుగా ఉండేదది — పైనించి కిందిదాకా వేసుకొన్నాడు. నెత్తిమీద దొరటోపి, కాళ్లకు నిగనిగలాడే బూట్లు!

అందరకుమల్లే అతడు గూడెం అవతలి గట్టుదగ్గరనుండి మాట్లాడలేదు. సరాసరిగా గంటలమ్మ చెట్టుదగ్గర కొచ్చాడు. గూడెంలో ఉన్న చిన్నా, చితకా, పిల్లా, పిచికా, అందరూ అక్కడికొచ్చారు. తనూ చెల్లాయికూడా వచ్చారు. ఆయన గారు, చాలా సంగతులు చెప్పుకొచ్చారు. మధ్యలో 'చదువు చదువు' అన్న మాటలు మాత్రం తనకు తెలిశాయి. తొందర్లోనే పొరంబోకు దిబ్బ పక్క స్కూలు పెడతామన్నారు. పక్కా బిల్డింగు అయ్యేదాకా పాకలో చదువుకోవచ్చు నన్నారు.

'చదువు లేకపోతే మనల్ని పశువులకన్నా హీనంగా చూస్తారు. మొదట్లో నేనూ, మీలాంటివాణ్నే! మా నాన్న మీకన్నా హీనంగా బతికాడు. చదువుకొంటే ఆయుస్సు తగ్గుతుందని ఎవరో అన్నారుట. మా నాన్నకు భయం పట్టుకొన్నది. మొదట్లో మా నాన్న అమ్మకూడా వొప్పుకో లేదు. అబ్రహాంగారు వారికి నచ్చచెప్పారు. చివరికి నేను చదువుకోవడానికి వాళ్లు వొప్పుకున్నారు. మనమందరం కుక్కల్లాగా పశువుల్లాగా బతుకుతున్నాం. ప్రియమైన తండ్రి పాపులను, క్షమించి రక్షణను కలుగచేయును. పాపులను తన హృదయములో దాచుకొను తండ్రి ఆయనొక్కడే! తండ్రి దృష్టిలో బిడ్డలందరూ సమానులైనట్లే, క్రీస్తు దేవునికికూడా అందరూ సమానులే. ఆయన పాపులను రక్షించుటకై, తన హృదయ రక్తమును ధారపోసెను.

'కనుక సోదరులారా! మీరందరూ మీ పిల్లలను బడికి పంపించండి. వారికి జ్ఞానమును కలిగించండి! వారిని మనుష్యులుగా తయారు చేయించండి. అక్కడ ఉచితముగానే చదువు

చెప్పేదరు. లేనివారికి, పలకలు పుస్తకములుకూడా ఇవ్వ బడును. కనుక మీ పిల్లలకోసం మీరు తండ్రి ఆజ్ఞను పాటించండి!'

సాల్మన్ అన్నంత పనీచేశాడు. పోరంబోకు దిబ్బ దగ్గరం రేకులపాక వేయించాడు. పాక చుట్టుతా బోలెడంత స్థలం. దానికవతల సీమతుమ్మ కంచె. ఒక మూలగా బావి. దానికి నాలుగువైపులా నాలుగు గిలకలు. అంతకుముందు నీళ్ళకోసం, చాలా దూరం పోవలసి వచ్చేది. సాల్మన్ ధర్మమా అంటూ ఆ గొడవ తీరిపోయింది.

మొదట్లో పది పదిహేనుమంది పిల్లలకన్నా ఎక్కువ చేరలేదు. క్రమంగా పిల్లలు ఎక్కువయ్యారు. దానికితోడు మేరీ టీచర్ కూడా చాలా మంచిది. విసుక్కోకుండా కసురుకోకుండా చదువు చెప్పేది.

చాలాకాలంపాటు స్కూలు, సరిగ్గా సాగలేదు. ఎక్కువ మంది పిల్లలు వచ్చేవారూ కాదు. ఏమాట కామాటే చెప్పుకోవాలి. సాల్మన్ వీలయినప్పుడల్లా, చదువుకోవడంలోని గొప్పతనాన్ని గురించి చెబుతూనే ఉండేవాడు.

కాని, గూడెంలోని పిల్లలకు, ఆపాటి తీరుబాటుకూడా లేదు. కొంతమంది గొడ్లు కాసేవారు. ఇంకొంతమంది, గుడిసెలకు కాపలా ఉండేవారు. మిగిలినవారు, కలవారిళ్లల్లో జీతాని కుండేవారు. అలాంటి వారందరినీ కూడదీశాడు, సాల్మన్. కొందరికి, ఆర్థికంగా, సహాయంకూడా చేశాడు.

చదువుతోబాటు, నాలుగు డబ్బులుకూడా రావడంతో, తమ పిల్లలు చదువుకోడానికి ఎక్కువమంది అభ్యంతరం చెప్పలేదు.

అంటరానివారందరూ చదువుకొంటున్నందుకు, ఊరివాళ్లు, ఆశ్చర్యపడ్డారు. 'ఈ స్కూలు ఎంతకాలం సాగుద్దిలే' అనుకొన్నారు.

అయితే వారనుకొంటున్నట్లు పాఠశాల మూతపడలేదు. ఏడెనిమిది సంవత్సరాలకల్లా, అదే బడి, హైస్కూలుగా మారిపోయింది. ఒకప్పుడు గూడెం వారు మాత్రమే చదువుకొనే, ఆ స్కూల్లో, ఇప్పుడు ఊరివారి పిల్లలుకూడా చదువుకో సాగారు.

సాల్మన్ గారంటే వారికి గౌరవం, భక్తి, భయంకూడా ఉండేవి. ఆయన్ను అంటుకోడానికిగాని, ఆయనతో కలిసిపోడానికి గానీ, ఊరివారికి అభ్యంతరం లేదు.

సాల్మన్ దొరల భాష మాట్లాడతాడు. ఆయనకు దొరలతో సావాసం ఉన్నది. ఆయనతో విరోధం పెట్టుకొంటే ఎలా?

* * *

అనుకొన్నవన్నీ అనుకొన్నట్లుగానే జరిగితే ఎంత బావుండును! తను చిన్నతనంలో ఎన్ని కలలు కన్నాడు! బ్రతుకును ఎంత సుందరంగా భావించాడు? కాని, తన ఊహకూ యధార్థానికీ మధ్య ఎక్కడా పోలికలే లేకుండాపోయాయి. తను ఆకాశంలో అందమైన హర్మ్యాలు నిర్మించుకొన్నాడు. కాని పరిస్థితులు, తనను దిగజార్చివేశాయి. తను అట్టడుగున లేకపోవచ్చు గాక—కాని, ఆ అడుగు పొరలోంచి బయటికి రాలేకపోయాడు. ఇంకా రాలేకపోతున్నాడు కూడాను.

'దీనికంతా కారణమేమిటి?' అని తనీనాడు బేరీజువేసి చూసుకొంటే, ఇన్ని పుంజీల కారణాలు కనిపిస్తున్నాయి. తనింత కలిగిన కుటుంబంలో పుట్టినట్లయితే, ఇంకా ఇంకా పెద్ద చదువులు చదువుకొనేవాడు. పెద్ద పెద్ద ఉద్యోగాలు కూడా చేసేవాడేమో... తను బాగా చదువుకోలేకపోవడానికి తన కులం అడ్డం వచ్చింది. తన ఆర్థిక పరిస్థితులుకూడా అడ్డుగానే నిలిచాయి.

నాన్న మాత్రం ఎన్నింటికని పారుకాడుతాడు కనక? తను కాస్త చేతికొచ్చాక, జీతం పని మానేశాడు. బాడవ పొలం నాలుగెకరాలు కౌలుకు తీసుకొన్నాడు. అమ్మా నాన్నా రేయింబవళ్లూ ఆ పొలం పనుల్తోనే మునగానాం తేలానాంగా ఉండేవారు. తనేమో, ఆదరా బాదరా ఇంత ముక్కా-నోటా కొట్టుకొని, స్కూలుకు వెళ్లిపోయేవాడు. చెల్లాయి వొక్కతే ఇంటిదగ్గర ఉండేది. పాపం దానికీ చదువుకోవా లనే ఉండేదేమో! ఎంతో ఆబగా తన పుస్తకాలకేసి చూస్తూ ఉండేది. అందులో ఉండే బొమ్మలను ఆత్రంగా గుర్తుపట్టేందుకు తంటాలు పడుతుండేది. కాని — అది చదువుకొండుకు వీలే ఉండేదిగాదు. అమ్మ పొలం పోయినపుడు, ఇంటి పనులన్నీ అదే చేసేది. పాలు తియ్యడం, కాచడం, తోడుపెట్టడం, తమ్ముణ్ని ఆడించడం, కోళ్లు మేపడం—ఎన్ని పనులు చూసేదో? ఓసారి సజ్జన్నంకూడా వొక్కతే వండింది. అందులోకి కారం కూడా కొట్టింది. సజ్జన్నంలో మాడుపు కారం కలుపుకు తింటుంటే — అబ్బ ఎంత రుచిగా ఉంటుందని! అప్పుడప్పుడు, పేలాలో గుగ్గిళ్లో చేసేది. సాతాళించిన శనగలంటే తన కిష్టమని చెల్లాయికి తెలుసు అందుకని పనిమాలా వాటిని

చేసేది. తన చెల్లెలని కాదు కానీ, అలాంటివాళ్లు క్రమ క్రమంగా లోపించి పోతున్నారిపుడు! ఎందుకనో తెలీదు. మనుషులమధ్య ఆ ప్రేమలూ, ఆప్యాయతలూ కూడా తగ్గి పోతున్నాయి. చదువు సంధ్యలు పెరిగి, నాగరికత పెరిగి, మనిషి ఆర్థికంగా పెరుగుతున్నకొద్దీ, మనిషి మనిషికాకుండా రాక్షసు డవుతున్నాడు. ఎందువల్ల? తనకైతే కారణం తోచ కుండా ఉంది.

పరీక్షలింకో రెండు మాసాలున్నాయనగా, హెడ్ మాష్టరు గారు అందర్నీ కష్టపడి చదవ మన్నారు. ఎవరికి ఏ సందేహా లున్నా అడగ మన్నాడు. ఆదివారాల రోజునా సెలవుల్లోనూ తన ఇంటికి రమ్మన్నాడు. వచ్చిన వారందరకూ ప్రైవేట్లు చెబుతా నన్నాడు. అనడమే కాదు, పాపం అలాగే చెప్పాడు కూడాను.

తనేమో, ఆ కిరసనాయిలు బుడ్డిముందు కూచుని, గంటల గ్గంటలు చదువుకొనేవాడు. అమ్మ తెల్లారగట్ల పొలం పోతూ పోతూ మళ్లా లేపేది. నాలుగు జోళ్ల నీళ్లు గాబులో పోసి మళ్ళా చదువుకొనేవాడు. చెల్లాయి ఇంటిపనుల్లో మునిగి పోయేది. పరీక్షలు దగ్గరపడుతున్న కొద్దీ, చెప్పరాని భయ మేదో గుండెల్ని దడదడ లాడించేది. అయితేనేం? తను బాగానే రాశాడు!

ఆఖరు పరీక్ష రాశాక, నెత్తిమీాంచి పెద్ద బరువేదో దిగి నట్లయి పోయింది. ఆ రోజుతో ఆ స్కూలుకూ తనకూ రుణం తీరినట్లే! భగవంతుడి దయవల్ల తాను పాసయితే, ఇక కాలేజీలో చేరాలి. తప్పితే మళ్లా చదవాలి. అందుకని

పిల్లలందరం కలిసి ఏదన్నా ప్రోగ్రాం పెట్టుకుంటే బావుంటుం దనిపించింది. శంకరయ్యా, చంద్రశేఖరం, నాయుడు, గోపాలం, అంతకుముందే యీ ఆలోచన చేశారుట. తనకు తెలీదు. వాళ్లు నలుగురూ కలిసి తబలా, ఘటం, గజ్జెలు, ప్రాక్టీసు చేశారు. హెడ్మాష్టరుగారు ముందుగా నాలుగు ముక్కలే మాట్లాడారు. ఆ తరువాత శంకరయ్య పార్టీవాళ్ల వాద్య గోష్ఠి.

చప్పట్లతో స్కూలంతా మోగిపోయింది. ఆ తరువాత సామ్యేలు పాట పాడాలి. కానీ జనం ఊరుకోలేదు. శంక రయ్య వాళ్లను ఇంకోవరస వాయించమన్నారు. ఆ తరువాత వెంకట కోటేశ్వరం పార్టీవారు, నెహ్రూజీమీద చిన్న బుర్ర కథను చెప్పారు. ఆ రోజుల్లో జవహర్ మీద బుర్ర కథను చెప్పడానికి ఎంత ధైర్యం కావాలో! రామిరెడ్డి పిట్టల దొర వేషం వేశాడు. తనేమో, జాషువాగారి గబ్బిలం పుస్తకం లోంచి నాలుగైదు పద్యాలు పాడాడు. సుబ్బలక్ష్మి—ఎరుకలమ్మి వేషం వేసింది. దాని దుంపతెగ! ఎంత బాగా చేసిందని! అంతకుముందు సుబ్బలక్ష్మి అంత తెలివైనదని తనకు తెలీదు. ఓ మాటా పలుకూ లేకుండా చింతలపాలెంనుండి చెరువుకట్ట మీదుగా వొక్కతే వచ్చేది సుబ్బులు. మళ్లీ వొక్కతే పోయేది. దానికి భయం గియం ఉండేవికావు. సుబ్బులు చదువుకోవడం చాలా ఆశ్చర్యమే! అసలే తక్కువ కులంలో పుట్టిందాయె. అందులోనూ ఆడదాయె! హరిజనులు చదువు కోవడమే — ఆ రోజుల్లో హరిజనులనికూడా అనేవారు కాదను కోండి; — అపురూపమైతే, అందులోనూ ఆడది చదువుకోడం మరీ అపురూపం.

కాదా మరి! ఫలితాలు తెలిశాయి. తను పాసయ్యాడు. ఆ రోజున నాన్న సంతోషానికి హద్దులేకుండా పోయింది. 'కోడినికోసి తీరాలిసిందే' నన్నాడు. అమ్మ తన ముఖంకేసి చూసింది. తనకెందుకో ఇలాంటి వ్యవహారాలంటే కిట్టవు. తను మెదలకుండా ఉండడంచూసి, నాన్నకూడా ఆ ప్రయత్నం మానివేశాడు. సుబ్బులు పనిమాలావచ్చి, తనకు థాంక్స్ చెప్పింది.

'వీటిమాటకేం గాని సుబ్బులూ! మీ నాన్న ఏమంటున్నాడు?' అన్నాడు తను.

'దేన్ని గురించి?' అన్నది సుబ్బులు అమాయికంగా.

'అదే సుబ్బులూ! నీ చదువు మాట' అన్నాడు తను.

'నాకైతే చదువుకోవాలనే ఉంది' అన్నది సుబ్బులు.

'మరింకేం?' అన్నాడు తను.

'కాని మా ఇంట్లో నానా గొడవలుగానూ ఉంది నారాయణా!' అన్నది సుబ్బులు నిట్టూరుస్తూ.

'అదేం?'

'మా పెద్దన్నయ్య పెళ్లాం కాపురాని కొచ్చింది' అన్నది సుబ్బులు బాధపడుతున్నట్లుగా.

'అయితే మీ అమ్మ సుఖపడుతుందిలే సుబ్బులూ! పాపం మీ అమ్మను చూస్తే గుండె చెరువయిపోతుంది నాకు. ఆ వయసులో బండెడు చాకిరీ తనొక్కతే చేసుకొంటుందిగదూ! మరి నువ్వేమో టింగురంగామంటూ స్కూలు కొస్తావామె?'

'అదే పేచీ నారాయణా మా యింట్లో' అన్నది సుబ్బులు. ఇప్పటికైనా నారాయణ కారణం కనుక్కొన్నందుకు సంతోషిస్తూన్నదానికి మల్లే!

'నాకు తెలియలా'.

'మా వదినకూడా అచ్చంగా నీకు మల్లేనే అంటుంది. తను ఇంటి చాకిరీ చెయ్యదుట. పుట్టింటి దగ్గర గారంగా పెరిగిందట'.

'అయితే?' అన్నాడు నారాయణ అయోమయంగా.

'నన్ను చదువు మానిపించ మంటుంది మా వదిన'.

'బాగానే ఉంది మేళం! మరి మీ అన్న య్యేమంటాడు?'

'వాడో వెర్రి వెంగళప్ప! పెళ్లామంటే లబలబలాడిపోతాడు. అది 'తాన' అంటే మా సన్నాసి 'తందాన' అంటాడు. పెళ్లాన్ని కాదనలేడు' అన్నది సుబ్బులు విసుగ్గా.

'అయితే మీ వదిన చాలా అదృష్టవంతురాలన్న మాట'.

'ఆఁ. నా బొంద' అని చప్పరించేసింది సుబ్బులు.

'అలా అనవాకు! నీకు మాత్రం నువ్వు చెప్పినట్లల్లా వినే మొగుడు దొరకాలని, మనసులో ఉండదా యేం?' అన్నాడు నవ్వుతూ తను.

'ఏయ్! మాటలు తిన్నగా రానియ్! మీ అయ్యతో చెప్పానంటే ... ?'

'మావాడు బుద్ధిమంతుడంటాడు నీకు తెలీదేమో!' అన్నాడు తను.

'అయితే నేనే పూనుకోవాలి' అన్నది సుబ్బులుకూడా నవ్వి.

'పెదకాపుగా రబ్బాయి దవడవాపు తగ్గిందేమో కను క్కొన్నావా సుబ్బులూ?'

'మళ్లా వాడు కనిపించందే!' అన్నది సుబ్బులు. ఈసారి ఆవిడ కళ్లు ఎరుపెక్కాయి.

'అసలా తోట పొలంవేపే రావడం లేదా?'

'నేనా డొంకన నడుస్తున్నంతకాలం రాడనుకో! వాడి రోజులు బాగుండి బతికాడు గానీ లేకపోతే ముఖం పచ్చడి చేసేదాన్ని నారాయణా ఏమనుకొన్నావో!'

'ఆడ హిట్లరువని పిల్లలు నిన్నూరికే పిలవడం లేదన్నమాట! అసలు నిన్ను చూస్తేనే హడలి చావాలి గదా సుబ్బులూ వాడు నీమీదికెల్లా వచ్చాడా అని.'

'ఏముంది నారాయణా! ఒళ్లు కొవ్వెక్కితే సరి—మా నాన్న వాళ్ల పొలంలో పనిచేస్తుంటాడు గదా! అది లోకువగా తీసుకొన్నాడు. అసలు అంతకుముందు రెండు మూడు వారాలబట్టీ అచ్చిమాట బుచ్చిమాట అంటుండేవాడు. నేనూ నవ్వుతూనే సమాధానం చెప్పాను! అదేదో అనుకున్నాడు వాడు! మన తడాఖా చూపించాను' అన్నది సుబ్బులు చిటిక వేస్తూ.

'ఇక జన్మలో నీ జోలికి రాడనుకో సుబ్బులూ! మీ అన్నయ్యా నాన్నా వాళ్లకు తెలుసా?'

'నేనే చెప్పాను. నే నొకందుకు చెబితే అది మరోలాగా తయారయింది. ఈడొచ్చిన పిల్లను బయటకు పంపితే ఇలాంటివే జరుగుతా యన్నది వదిన'.

ఈ మాట వింటూనే అదిరిపోయాడు తను.

‘అయితే నిన్నిక బళ్ళోకి పంపరన్న మాట’ అన్నాడు వాణు కుతూ.

‘ఏం జరుగుతుందో చూడాలి! మా అన్నయ్య వేరుపడతా నంటున్నాడు. అమ్మకు ఎడంచెయ్యీ కాలూ పడిపోయింది. మరి ఇంటి చాకిరీ అంతా నేనే చెయ్యాలి’.

‘అదీ మంచిదేలే సుబ్బులూ! పనేమీ రాకపోతే రేపు మీ ఆయన మాత్రం ఊరుకుంటాడా?’ అని హాస్యమాడాడు తను.

‘ఏయ్ నారాయణా’ అని బెదిరించింది సుబ్బులు.

‘ఒకవేళ మోజుకొద్దీ వాడూరుకొన్నా, అత్తా మామా ఊరుకొంటారా?’ అని రెట్టించాడు తను.

‘ఏయ్. బండిని ఆపుచెయ్యి’.

‘నీ చేతులమీదుగా ఎందరి దవడలు పేలిపోవాలో సుబ్బులూ?’ అన్నాడు తను.

‘ఆ లిస్టులో నీ పేరుకూడా చేర్చాలా ఏం?’ అన్నది సుబ్బులు.

‘ఒద్దు గానీ మీ డొంకన నాగజెముడు బాగా ఉన్నదా సుబ్బులూ?’

‘వైద్యానికా?’

‘నాగజెముడు గుబ్బలు తినాలని ఉన్నది సుబ్బులూ’ అన్నాడు తను.

‘ఓ! బోలెడన్ని!’.

‘అయితే రేపు డొంకదగ్గర కొస్తాను. పోతే ఉప్పూ నువ్వూ తెస్తావా నేను తీసుకురానా?’ అన్నాడు మెల్లగా తను.

ఆ మొన్నాడు డొంకలో కలుసుకొన్నప్పుడు సుబ్బులు చెప్పింది—తను చదువు మానేశానని. వదిన పట్టుదలకన్నా ముఖ్యం—ఇదిగో ఇలాంటి గొడవలు రాకుండా ఉండడమని; వాళ్ల నాన్న అన్నాడట. తను బాధ పడ్డాడు. కానీ చేయ కలిగిం దేమున్నది? తనేమీ చేయలేడన్న సంగతి మరోసారి రుజువయింది. తను గుంటూరు వెళ్లి చదువుకొంటానన్నప్పుడు, నాన్నకూడా వీలుపడ దన్నాడు.

'ఇంకా నన్ను ఇబ్బంది పెట్టబాకురా అబ్బాయ్! ఇప్పటికే, చేసీ చేసీ నా గూళ్లు పడిపోతున్నాయి. సందెడుమోపు నెత్తుకొంటే ఒకటే ఆయాసం' అన్నాడు నాన్న!

'మందేదన్నా తిను నాన్నా' అన్నాడు తను.

'ఈ ముసలితనంలో మందు వంటబట్టదురా అబ్బాయ్'.

'మరెట్లా నాన్నా?'

'కాస్త నాకు తీరిక దొరికిందంటే, తాడికొండ పోవాల్రా! అక్కడ కోటయ్యగా రున్నారు. ఆయన మంత్రం వేశాడంటే ఎలాంటి రోగమయినా నయం కావలసిందేననుకో! అయ్య గారికి ఎగసాయంకూడా ఉంది. గిత్తల్ని అమ్ముతాడంట. నేను పై పనులు చూస్తూ ఉంటాను. నువ్వు మరో పదెక రాలు కౌలుకు తీసుకున్నావంటే — రాజాగా జరిగిపోతుందిరా సంసారం' అని తన మనసులో మాట చెప్పాడు నాన్న.

'నాకింకా చదువుకోవాలని ఉంది నాన్నా' అన్నాడు తను మెల్లగా.

'ఈ ఊళ్లో బడి ఉంటే నేనే తంటాలు పడతాననుకోరా! నిన్ను గుంటూర్లో ఉంచాలి. నెలానెలా నీకు పైకం పంపిం

చాలి. అది మన తాగతుకు మించిన యవ్వారంరా అబ్బాయ్! మన సంసారం గొడవలు నీకు తెలవనివి కాదు గదా! యీ ఏడు నీకూ చిట్టెమ్మకూ పెళ్లిళ్లు చేస్తే నా బరువు సగం తగ్గుతుం దనుకో అబ్బాయ్' అన్నాడు నాన్న.

తనకు వారం పది రోజులపాటు అన్నం తినబుద్ధి కాలేదు. కేవలమూ డబ్బు కారణంగా ఒక వ్యక్తి చదువుకోలేకపోవడం కన్నా దౌర్భాగ్యాన్ని తను ఊహించలేదు. తన ఊళ్లో కాలేజీ ఉన్నా బాగుండిపోను. కనీసం తమకింత డబ్బుంటే ఈ సమస్యలేవీ ఉండేవికావు! తను దరిద్రుడు. తన తండ్రి దరిద్రుడు. తన చుట్టాలు పక్కాలు దరిద్రులు. అందువల్ల తను చదువుకోలేక పోతున్నాడు. చదువుకోలేదు గనుక, తనకు మంచి ఉద్యోగాలు రావు. మంచి ఉద్యోగం రాదు గనుక మంచి జీతం రాదు. మంచి జీతం రాదు గనుక తను కూడా దరిద్రంతోనే మగ్గి చావాలి. తనే దరిద్రుడయితే తన పిల్లలు ఇంకా దరిద్రు లవుతారు. ఈ దరిద్రమనే మహా పాపకూపంనుండి ఎప్పుడు బయటపడడం? ఎలా బయట పడడం?

లోపల్లోపల ఏం జరిగాయో తెలీదు. సుబ్బులు నాన్న అయిదారుసార్లు తమ ఇంటికొచ్చాడు. నాన్న అమ్మ చింతల పాలెం చాలాసార్లు వెళ్లొచ్చారు. చిట్టెమ్మ ఏదో సూటీ పోటీగా అంటున్నదే గానీ తను పట్టించుకోలేదు. ఆఖరుకు పెళ్లి నిశ్చయమయింది. సుబ్బుల్ని చేసుకోవడానికి తనకైతే అభ్యంతరం లేనిమాట నిజమే! మరి దాని సంగతేమిటో తనకు తెలీదు. మామూలుగా అయితే ముత్యాలమ్మ గుడిముందు

తమ పెళ్లి జరగాలి. కాని స్మాల్సన్‌గారు, చాలా కొత్త తర హాగా ఏర్పాట్లు చేశారు. గుంటూరునించి ఉన్నవ లక్ష్మీ నారాయణ పంతులుగార్ని పిలుచుకొచ్చారు. తెనాలినుండి త్రిపురనేని రామస్వామి చౌదరిగార్నీ తీసుకొచ్చారు. 'రామ స్వామి చౌదరిగారు, గొప్ప పండితుడూ, కవీ సంఘ సంస్కర్తా' అని చెప్పారు స్మాల్సన్‌గారు. లక్ష్మీనారాయణగారు తమ పెళ్లికి పెద్దరికం వహించారు. రామస్వామిగారు, తెలుగులో మంత్రాలు చెప్పారు.

చిత్రమేమిటంటే అలాంటి పద్ధతుల్లో పెళ్లి జరగడం ఆ ప్రాంతానికంతా అదే మొదటిసారి. అంతకుముందు గూడెంలో పెళ్లంటే కల్లు ముంతలూ ఆటలూ తప్ప మరోటి ఉండేదే కాదు. ఈ మహానుభావు లిద్దరూ దాన్ని సీదాగా మార్చేశారు. అంతకుముందు గూడెంలో వాళ్లు పెళ్లి చేసు కొంటే ఊరేగింపు లసలే ఉండేవికావు.

రామస్వామిగారూ, ఉన్నవవారూ పల్లకీకి చెరోవైపునా నిలబడి ఊరంతా ఊరేగించారు. ఆ ఊరి చరిత్రలో అంట రానివారు పల్లకీ ఎక్కి సవర్ణుల పేటలో ఊరేగడానికి అదే ప్రారంభం. అమ్మా నాన్నా చాలా భయపడ్డారు. ఊళ్లో వాళ్లుకూడా కొంతమంది ఊరేగింపును అడ్డుకోవాలని చూశా రట. కానీ, ఉన్నవవారూ, రామస్వామిగారూ స్వయంగా దగ్గరుండి పోవడంవల్లా, పోలీసుల్నికూడా పిలిపించడంవల్లా ఏ గొడవలూ రాలేదు.

* * *

ఇన్నేళ్ల తరువాత, జీవితంలో ఎన్నో ఢక్కా-మొక్కీలు తిన్న తరువాత, వెలుగునీడల పడుగు పేకల్లోంచి చూస్తూ ఉంటే తనకు తెలిసింది చాలా స్వల్పమనీ, తెలుసుకోవలసింది అపారంగా ఉన్నదనీ అనిపిస్తూ ఉంది.

తన కళ్లముందే ఎన్నో మార్పులు జరిగిపోయాయి! ఎన్నో జరుగుతున్నాయి! ఇంకెన్ని జరుగనున్నాయో కూడా తను ఊహించలేకుండా ఉన్నాడు. అనేక వందల సంవత్సరాల పాటు శిలా సదృశంగా నిర్జీవంగా ఉండిపోయిన సమాజంలో కదలికలను తను చూశాడు. మార్పులను చూశాడు. ప్రతి మార్పు వెనుకా ఉన్న సంఘర్షణను చూశాడు. ఓ చిన్న పరిణామంకోసం జరిగిన అపారమైన కృషిని చూశాడు. మనిషి లోని పశువును చూశాడు. చిత్రమేమిటంటే — మనిషిలోని దేవత్వాన్నికూడా తను చూశాడు.

హరిజనులు వీధుల్లో నడవడానిక్కూడా వీలులేని రోజుల్లో తను జన్మించాడు. తన ముత్తాత, తాత, తన తండ్రి, ఆ చీకటి గుయ్యారాల్లో, మురికికూపాల్లో, భయంకరమైన పరిస్థితుల మధ్య, మృగాలకన్న అధ్వాన్నంగా జీవించారు. తన బాల్య మంతా అలాంటి వాతావరణంలోనే గడచిపోయింది. కానీ ఆ తరువాత వచ్చిన మార్పుల సంగతేమిటని? వాటిని తక్కువ అంచనా వేయడానికి లేదే! తన వివాహం—ఆ గ్రామంలో తీసుకొచ్చిన మార్పు ఇంతా అంతా కాదు. సవర్ణులయిన, ఉన్నవవారూ, రామస్వామి చౌదరిగారూ, ముందుండి పెళ్లి జరిపించడంతో, ఎవ్వరూ అప్పటికప్పుడు కిక్కురు మనక పోయినా, ఆ సంఘటన తాలూకు ప్రభావం ఆ తరువాత

చాలా తీవ్రంగా ఉన్నది. గ్రామ పెద్దలంతా కూడ బలుక్కున్నారుట. వాళ్లలో వాళ్లు చర్చలు జరుపుకొన్నారుట. ఊరు ఊరంతా ఏకమై గూడెంమీద కత్తికట్టారు. గూడెంలో వాళ్లను నల్లుల్ని మాడ్చినట్లు మాడ్చి పారేయాలనుకొన్నారు. ప్రభువులు తెలుసుకోకుండానే ఉండాలిగానీ, తెలుసుకొన్న తరువాత దెబ్బలకు కొదవంటూ ఉంటుందా?

విడివిడిగా ఉంటున్న రెండు గూడేలూ రెండు మూడు మాసాలుపాటు అక్షరాలా ఆకలితో అలమటించిపోయాయి. అవును పోక ఏం చేస్తాయి గనుక? రైతులందరూ కట్టుమీద నిలబడ్డారు. గూడెంలో వాళ్లకు గింజా గిటకా కొలవడం మానేశారు. కూలికీ నాలికీ పిలవడం మానేశారు. చద్దీ గిద్దీ విదపడం మానేశారు. అంతకుముందు యీ గూడెంలోని వారంతా పొలాలమీద పడి, పొల్లూ నెల్లూ ఏరుకుంటూ ఉండేవారు. గడ్డి గాదం రొల్లుకుంటూ ఉండేవారు. తాలూ, తప్పా పోగేసుకుంటూ ఉండేవారు. దీనివల్ల కడుపులు నిండిపోయాయని కాదుగానీ, మరీ తిండికి మాడి చావకుండా ప్రాణాలనన్నా ఉగ్గబట్టుకోవడానికి వీలయ్యేది. తన పెళ్లి మూలకంగా ఇవన్నీ బందయి పోయాయి.

ఈ సంక్షోభానికంతకూ కారణం తనేనని తెలిసినప్పుడు, తన మనస్సెంత ఖేదించిందో ఎలా చెప్పడం? సుబ్బులుకూడా చాలాసార్లు తనతో అన్నది — ఎందుకొచ్చిన లాయిలాసా ఇదంతా—జరిగిందేదో జరిగిపోయింది. దాన్నిప్పుడు సర్దుకోడానిగ్గానీ మార్చుకోడానిగ్గానీ ఏమీలేదు. తను చేసింది తప్పని వొప్పుకొన్నా, యీ శిక్ష తప్పేలాగా లేదు. తనో

సారి ఎందుకన్నా మంచిదని ఉన్నవవారిని కలుసుకొన్నాడు. ఊళ్లో జరిగిన గొడవలు, జరుగుతున్న వ్యవహారాలు, చెప్పు కొచ్చాడు. ఉన్నవవారు అంతా విని కళ్ల నీళ్లు పెట్టు కొన్నారు పాపం! ఆ నీటిపొరల వెనుక భయంలేదు, దీనత్వం లేదు, అమేయమైన కాంతుల్ని తను చూశాడు.

ఆ పూట తను ఉన్నవ వారింట్లోనే భోజనం చేశాడు. అదో కొత్త అనుభవం! అంతకుముందు గొప్పవారు కొద్దివారి కొంపలకు వస్తారనీ, వారితోబాటే నులక మంచాలమీద కూచుంటారనీ, మురికి వోడుతున్న వారి గుడిసెల్లో తిరుగు తారనీ, వారి పిల్లల్ని ముట్టుకొని మురిపెం చేస్తారనీ తను విన్నాడు. ప్రత్యక్షంగా చూశాడు. అలా చేయడంకూడా గొప్పవారి లక్షణాల్లో వొక భాగమే ననుకొన్నాడు తను. అలాంటిలాంటి మహావ్యక్తి— ఆ దిక్కుమాలిన కొంపలమధ్య తిరగడమే వారి గొప్పతనానికి సాక్ష్యంగా ఉండిపోతుంది.

కానీ కొద్దివారు, అదే గొప్పవాడి ఇంటికి పోయినప్పుడు, అల్లా గొప్పవాడి ప్రవర్తన ఎలా ఉంటుంది? చాలామంది వరండాలోనే నిలబెట్టి మాట్లాడి పంపేస్తారు. కొంతమంది ఆప్యాయంగా నవ్వి, అంతకన్నా ఆప్యాయంగా భుజంమీద చేయివేసి, ఆకుకు అందకుండా పోకకు పొందకుండా కబుర్లు చెప్పి, వీధిదాకా సాగనంపి మరీ వెళ్లిపోతారని తనొకనాడు విన్నాడు. కానీ ఇప్పుడు తను అనుభవించింది అది కాదు—ఉన్నవవారు తనను లోపలికి రమ్మన్నప్పుడు, తన కాళ్లు వణికాయి. గుండెల్లో దడ బయలుదేరింది. శరీరమంతటా సన్నని వణుకులాంటి దేదో బయలుదేరింది. తనేదో చేయ

కూడని పనిచేస్తూ ఉన్నట్లు, అంతరాత్మ నన పెట్టసాగింది. తన పరిస్థితిని ఆయన గ్రహించారులా ఉన్నది. సన్నగా నవ్వి, అలా నవ్వుతూనే భార్యను కేకేసి, 'అబ్బాయొచ్చాడేవ్' అంటూ అమ్మకు తనను పరిచయం చేశారు.

లక్ష్మి మాట తనకు తెలీదుగానీ, వారింటినిండా సరస్వతిని మాత్రం తను చూశాడు. ఎన్ని పుస్తకాలు ఎన్ని పుస్తకాలు! ఓ మూలగా రాట్నం, ఇంకోపక్కన ఏకులు, ద్వారబంధం మీద, గాంధీజీ కస్తూరిబాయిల ఫోటోలు; ఆ ఫోటోలవేపు చూస్తూనే తను నిలబడిపోయాడు. బక్కచిక్కిన ఈ బడుగు తాపసి తమలాంటివారికోసం ఎన్ని ప్రయత్నాలు చేస్తున్నాడు? 'తెల్లవారినుండి భారతీయులకు స్వేచ్ఛ లభించడం ఎంత అవసరమో, సవర్ణులనుండి హరిజనులకు స్వేచ్ఛ లభించడం అంతకన్నా అవసరం' అంటున్నారు గాంధీజీ. హరిజనుల సంక్షేమం కోసం, తన హిందూ మిత్రులనందరినీ వదులుకోడానికైనా తను సిద్ధంగానే ఉన్నానని చెప్పారుట బాపూ! వారి నోసారి జూడగలిగితే! ఆ కోరిక, ఆతరువాత చాలా కాలానికి గానీ తీరలేదు. మహాత్ముణ్ని చూడడమే కాదు; వారి ఉపన్యాసాల్ని కూడా తను విన్నాడు.

ఆనాడు—తన జన్మకో సార్థకం లభించినట్లయింది. అంతకు ముందు వారూ, రామస్వామిగారూ తన ఇంట భోజనంచేసిన మాట నిజమే. తనూ సుబ్బులూ వారికి చెరోప్రక్కనా కూచుని భోజనంచేసిన మాటా నిజమే. ఆ సంఘటనకే తను దిమ్మరపోయాడు. కానీ ఆనాడు అంతకన్నా గొప్ప సంఘటన జరిగింది. తనూ, పంతులుగారూ, ప్రక్క ప్రక్కన్నే కూచు

న్నారు! అమ్మగారు వడ్డించారు. నిజం చెప్పాలంటే, తను కడుపునిండా అన్నం తినలేకపోయాడు. ఓ బెదురు, భయం! కానిపనేదో చేస్తున్నాననే భీతి, తనను అతలాకుతలం చేసి పారేశాయి. అమ్మ! అవును ఆనాటినుండీ తనామెగారిని 'అమ్మా' అనే పిలుచుకొన్నాడు. ఆమెకూడా తనను 'నాయనా' అనే పిలిచేది—అమ్మ కట్లపీట వేసుకూర్చుని కొసరికొసరి వడ్డించింది. విస్తరాకులో తినడం తనకు బొత్తిగా కొత్త. కుట్లు ఊడి యీనెపుల్లలు నోట్లోకిరావడం, కొలమారడం, తనెప్పటికి మరిచిపోలేదు. ఉన్నవవారు తనను తెనాలి తీసుకెళ్లారు. రైలెక్కడం తనకు అదే మొట్టమొదటిసారి. రైల్లో తన తోబాటు ఇంకా చాలామంది కూచున్నారు. వారందరూ, తనను ఆనుకొనే కూచున్నారు. అక్కడేమీ మరి, యీ అంటూ సొంటూ ఏమీ పాటిస్తున్నట్లు లేదుమరి.

రామస్వామిగారు ఊరికి ఆ చివర పొలాల్లో ఇల్లుకట్టుకొని వుంటున్నారు. ఇంటిపేరు 'సూతాశ్రమం' అట! పంతులు గారినీ తననూ చూస్తూనే వారు నవ్వారు. నవ్వారంటే— వారు నవ్వడం కనిపించదు. గుబురు మీసాలు అందంగా కదులుతాయి — అంతే!

పంతులుగార్ని చూస్తూనే 'గోపీ' అంటూ కేకేశారాయన. ఎర్రగా బొద్దుగా గుమ్మడి పండులా ఉన్న కుర్రాడు—కుర్రాడేమిట్లే తనకన్నా కొంచెం పెద్దవాడే — బితుకుబితుగ్గా వచ్చి పంతులుగారికి నమస్కారం చేశాడు. తనవేపోసారి చూసి ఏదో అడగబోయి, తండ్రిని చూసి ఊరకుండి పోయాడు. ఉన్నవవారూ, రామస్వామిగారూ చాలానేపు కబుర్లాడు

కొన్నారు. వాటిలో కొన్ని తనకు తెలిశాయి. ఇంకొన్ని బొత్తిగా అర్థం కాలేదు. తనకు తెల్సిందల్లా చౌదరిగారు నాటకం రాస్తున్నారూ అని! రామాయణం గురించి మాట్లాడుతూ, ఎక్కడెక్కడినుంచో పద్యాలూ అవీ చదవడం ప్రారంభించారాయన. అతని పేరేమిటో ఉన్నది—శంబుకుడనో, ఏదో అన్నాడు,—ఆ పాత్రను ఆధారంగా తీసుకొని నాటకం రాస్తున్నారుట.

అంతా అయ్యాక తన ప్రసక్తి తీసుకొచ్చారు పంతులుగారు. తనుకూడా జరుగుతున్నదంతా చెప్పుకొచ్చాడు. లోపలికెళ్లి రవంతసేపటికల్లా ఇంత మూటతో తిరిగొచ్చారాయన. అది డబ్బుమూటని తరువాతగానీ తనకు తెలియలేదు. గుంటూరొచ్చాక ఉన్నవవారూ ఆ మూటకు ఇంకొంత చేర్చారు. ముతకధోవతీ ముతకలాల్చీ వేసుకొన్నవో ప్లీడరుగారు రెండు పెద్ద నోట్లు తీసుకొచ్చి ఉన్నవ వారికిచ్చారు.

'ఈ డబ్బంతా జాగ్రత్తగా తీసుకుపో నాయనా! మీ నాన్నగారికివ్వు. అందర్నీ పిలిచి తలా కాస్తా పంచిపెట్టమని చెప్పు. అంతో ఇంతో ఉన్నవారికి కాస్త తక్కువిచ్చినా ఇబ్బంది లేదు. మరీ రెక్కాడితేగాని, డొక్కాడని వారుంటారు చూడూ, వాళ్లను కాస్త కనిపెట్టి చూడమని చెప్పు బాబూ' అన్నారు ఉన్నవవారు.

'అలాగే చెబుతానండి.'

'కాస్త జాగ్రత్తగా ఉండమని మీవారందరికీ చెప్పు నాయనా! కోపాలూ తాపాలూ పనిచెయ్యవు! ఉద్రేకం అసలే పనికిరాదు. కాస్త శాంతంగా నెమ్మదిగా మసలడం అవసరం' అని హితబోధ చేశారాయనగారు.

'కానీ అవతలవాళ్లు కవ్వించి కాలుతువ్వుతున్నారు బాబుగారూ' అన్నాడు తను గుటకలుమింగుతూ.

'అవున్నాయనా! అచ్చంగా అలాగే జరుగుతుంది! మార్పు ఓ రోజులోనో, ఓ వారంలోనో వస్తుం దనుకోకు. ఇంకా మన ఊరు నయం. కొన్నికొన్ని చోట్ల కొట్లాటలు హత్యలూ కూడా జరిగాయి. అందుకే బాపూ ఈ ఉద్యమాన్ని చేపట్టాడు. జాతీయోద్యమంలో దీనికి ప్రాముఖ్యాన్నిచ్చారు. ఇవిగో ఈ పుస్తకాలు తీసుకెళ్లు. వీలయినప్పుడల్లా మనవారికి చదివి వినిపించు.'

'అలాగేనండి' అన్నాడు తను.

'వెంకటప్పయ్యగారు బందరు కెళ్లారుట. వారు రాగానే ఓసారి మీా ఊరు వస్తాం. సీతారామ శాస్త్రిగారుకూడా లేరు. వార్ధా వెళ్లారు. వీలుంటే మేం ముగ్గురమూ కలిసే వస్తాం' అన్నారు ఉన్నవవారు.

'ఆ ఊరు వెళ్లాలంటే నాకెందుకో భయంగా ఉన్నదండీ! ఏ నిమిషాన ఏం జరుగుతుందోకూడా తెలియకుండా ఉన్నదండి' అన్నాడు తను.

'అవును. నాకు తెలుసు—భయపడి పారిపోవడం మంచిపని కాదు బాబూ. ఈ దారుణం మీావొక్క ఊళ్లోనే కాదు; అన్నిచోట్లా ఉన్నది. ఎక్కడికని పోతావ్? ఎంత దూరమని పోతావ్? ఉన్నచోటే ఉండాలి. మిన్నువిరిగి మీాదపడినా కదలకూడదు. ఎవరో కొందరు ఆహుతికానిదే, ఏ ఉద్యమమూ గడిచి గట్టెక్కదు' అన్నారు ఉన్నవవారు.

తను ఊరికి వచ్చేశాడు. తనకోసం అమ్మా నాన్నా కళ్లల్లో వత్తులు వేసుకొని చూస్తున్నారు. తను గుంటూరు వెళ్లినట్లు ఊళ్లో తెలిసిందట. వస్తూ వస్తూ పోలీసుల్ని తీసుకొస్తానని కూడా కొంత మంది అనుకొంటున్నారుట.

'ఇదంతా నిజమేనా?' అన్నది సుబ్బులు, అదోల్లాగా చూస్తూ.

'నీకేమన్నా పిచ్చా? చపల చిత్తమా?' అన్నాడు తను.

'మల్లా ఏవొకట్టో దేనికి ఖర్మం? నాకు పిచ్చీ చపల చిత్తమూ రెండూ ఉన్నాయి' అన్నది సుబ్బులు.

'కాకపోతే, నిన్నూ నన్నూ చూసి ఏ పోలీసులొస్తారోయ్?'

'నన్ను చూసి పోలీసులెందుకొస్తార్లేగానీ—ఏమిటా మాట?' అన్నది సుబ్బులు.

'ఏది?'

'ఇందాక నువ్వు తీసుకురాలా?' అని జ్ఞాపకం చేసింది సుబ్బులు.

'అదా! పంతులుగారూ చౌదరిగారూ, మన గూడెంలో వాళ్లకు పంచిపెట్టమని ఇచ్చారే! అయిదారు రోజుల్లో వాళ్లంతా ఇక్కడికొస్తారుట' అన్నాడు తను.

'మల్లా ఏం పీకలమీదికి తెచ్చి పెడతారో ఏమో? ఎందు కొచ్చిన తిమిరింగం ఇదంతా? మనం ఆర్చేవాళ్లమా తీర్చే వాళ్లమా?' అని చప్పరించింది సుబ్బులు.

'కాబట్టి వాళ్లను రావద్దని చెప్పమంటావా ఏమిటే?'

'చెప్పమనికాదు నేననేది! వాళ్లంతా బాగా ఉన్నవాళ్లు ఏ వేషాలు వేసినా చెల్లిపోతుంది. మనం కూట్లో ఉన్న రాయినే తీసుకోలేనివాళ్లంగదా, ఏట్లో రాయి సంగతి మనకెందుకూ అని?' అన్నది సుబ్బులు పెద్ద ఆరిందాలాగా.

'నీ ఆడబుద్ధి పోనిచ్చుకొన్నావుగాదే! వాళ్లీ పనులన్నీ చేయడం వారికోసం గాదు.'

'అవుననుకో' అని నసిగింది సుబ్బులు.

'మరి? అంచేత నువ్వాల్టే పిచ్చిపిచ్చిగా వాగకు. సరా?'

'నే నెందుకంటున్నానో నీకు తెలియదు. స్టాల్మన్‌గారు కూడా, ఇవ్వాళ పొద్దుటే గుంటూరు వెళ్లారు. జిల్లాకలెక్టరు సీమదొరగారట. స్టాల్మన్‌గారికేమో, వారు బాగా తెలుసుట. ఇక్కడి సంగతులన్నీ దొరగారికి చెప్పి, మనకేదన్నా సహాయం చెయ్యమని అడుగుతారట' అన్నది సుబ్బులు రహస్యం చెబుతున్న దానిలాగా.

'మంచిదేనే జరగనివ్వు.'

'స్టాల్మన్‌గారు ఇంకో మాటకూడా అన్నారు' అన్నది సుబ్బులు నీళ్ళు నములుతూ.

'ఊఁ' అన్నాడు తను చెప్పమన్నట్టుగా.

'ఆ దొరగారికి ఏసుక్రీస్తు అంటే ఎంతో భక్తి, శ్రద్ధా ఉన్నాయట. ఆ మతం పుచ్చుకొన్న వారందరికీ ఆయన స్వయంగా చదువులు చెప్పించారుట. ఉద్యోగాలు ఇప్పించారుట. ఒకవేళ దొరగారుగానీ 'వాళ్లంతా క్రైస్తవులేనా?' అనడిగితే 'మతం పుచ్చుకోడానికి వారంతా సిద్ధంగా ఉన్నా'రని కూడా స్టాల్మన్‌గారు చెబుతా నన్నారు' అన్నది సుబ్బులు.

'ఏమిటోనే సుబ్బులూ! నాకంతా గజిబిజిగా గందర గోళంగా ఉంది. వీళ్ళేమిటీ మనల్ని తరిమి తరిమి వేటాడు తున్నారు. దొరలేమో దగ్గరకుతీసుకొని మతం ఇప్పించి ఆదరిస్తున్నారు' అన్నాడు కణతలు నొక్కుకొంటూ తను.

'మనంకూడా అందులో చేరితో పోలా?'

'పీడా వదలిపోతుంది. ఎంతకాలమని పురుగులకన్నా అధ్వాన్నంగా బతుకుతాం, మనం మాత్రం?' అన్నాడు తను విసుగ్గా.

'పొద్దున్న మామయ్యా సాల్మన్‌గారూ చాలాసేపు దీన్ని గురించే మాట్లాడుకొన్నారు! నీకోపం వచ్చినా సరేగానీ మీ అయ్యదగ్గర చాలా చాదస్తం ఉన్నదనుకో.'

'సరేలేవే! తొందరగా జడల్లు, ఇందాకణ్నించి చూస్తు న్నాను' అన్నాడు తను.

'నేను జడల్లుకోవడమేనా నీకూ కూడా జడ...'

'మీ అమ్మ నీకు మణుగులకొద్దీ వసపోసి ఉండాలే సుబ్బులూ!'

'రేపు వెళ్లినప్పుడు, ఎన్ని మణుగుల వసపోసిందీ కనుక్కొని చెబుతా!'

'వసతోబాటు బుర్రకాయ మొద్దుబారేందుకు ఇంకేదన్నా కలిపిందేమోకూడా కనుక్కోవాలి. మరచిపోవాకు సుబ్బులూ!' అన్నాడు తను నవ్వుతూ.

'అది మీ అమ్మనడగాల్సిన ప్రశ్నగదూ?' అన్నది సుబ్బులు; జడ చివర ఊలుతో ముడివేస్తూ.

'చూశావా! లక్షసార్లు చెప్పాను, కాటుక పెట్టుకొన్నాక, వేళ్లను తలకు రాసుకోవద్దే అని. ఆ డాగులన్నీ మళ్లా నాకంటు కొంటాయి' అన్నాడు తను.

'ఈ శాణాతనానికేంగానీ, ఉండు, పాలల్లో తోడేసిరావాలి' అంటూనే సుబ్బులు లోపలికెళ్లింది.

పాలల్లో తోడువేసిందో లేదో తెలీదుగానీ, తలుపుకు మాత్రం గడియ వేసింది. దీపాన్ని బాగా తగ్గించింది.

* * *

తనేదో అనుకొన్నాడు, ఇంకేదో జరిగింది. భవిష్యత్తు ఎంతో సుందరంగా ఉంటుందని, తను భావించాడు. తీయని కలలు కన్నాడు. కానీ అవన్నీ నీళ్లు కారిపోయాయి. తన ఆలోచనకూ యదార్థ పరిస్థితులకూ మధ్య, తను ఊహించని అగడ్తలేవో ఏర్పడ్డాయి. తను చేదామనుకొన్నవేవీ చేయలేక పోయాడు. ఎందువల్ల? కారణాలు చాలా ఉన్నాయి. మొదటి దేమిటంటే సంసారభారం యావత్తూ తనమీద విరుచుకుపడింది. నాన్న పనిచేయలేకుండా ఉన్నాడు. అప్పటికీ ఏదో ఆయన పారుకాడుతూనే ఉన్నాడు. కాని ఎంత కాల మని యీ లాయీలాసా? తనేమో గోళ్లుగిల్లుకుంటూ కూచుం టున్నాడు. ఆ వయస్సుల్లో ఆయనగారేమో పనుల్లోకి పోతున్నాడు. తను సంఘసేవ చేయడం మాట దేవుడెరుగు; అంతకన్నా ముఖ్యం—తన కుటుంబసేవ చేసుకోవాలి. తన భారం మరొకరిమీద పడకుండా చూసుకుంటే ఆ మేరకు తను సంఘసేవ చేసినట్లే అవుతుంది.

తనకిప్పు డనిపిస్తున్నది — చదువు చెప్పించి నాన్న చాలా పొరబాటు చేశాడేమోనని! ఎంచాతంటే, చదువుకోవడం వల్ల పనిపాట్లు చేయడమంటే అదోలా ఉంటుంది ప్రాణానికి. ఇంత చదువూ చదువుకొని, మట్టి పిసుక్కోవడమే తప్పకపోతే, మరి చదువుకోవడంవల్ల లాభమేమిటి? ఈ చదువువల్ల ఉపయోగమేమీ లేదా — అని అడిగితే తను సమాధానం చెప్పడంకూడా కష్టమే! చదువుకొన్నాడు గనుకనే తనూ, తనవారూ ఎలాంటి అధ్వాన్న పరిస్థితుల్లో ఉన్నదీ గ్రహించ గలిగాడు. ఈ పరిస్థితులను మార్చాలనీ, మార్చితీరాలనీ, తను అనుకోడానికి తను చదువుకోవడమే కారణం. ఈ సత్యాన్ని తనుమాత్రం కాదనగలడా? వీటన్నింటినీమించి గ్రామాల్లో పేరుకుపోయిన యీ దుర్భరపరిస్థితులు, తనను పిచ్చివాణ్ని చేసిపారేస్తున్నాయి. వీటిల్లో తను ఎక్కువ కాలం ఉండడం అసంభవం.

ఈ చిరాకులతోబాటుగా చెల్లెలి పెళ్లొకటి వొచ్చిపడింది! తను దాని పెళ్లిని గురించి ఆలోచించడం లేదనడం అబద్ధం. దానికితగిన సంబంధంకోసం తనూ వెదుకుతూనే ఉన్నాడు. ప్రస్తుతం తనముందున్న సమస్యలు ఇన్నీ అన్నీ కావు.

ముందుగా తనో ఉద్యోగం చూసుకోవాలి. ఆ ఉద్యోగం తన కుటుంబపోషణకు సరిపడేటంత ఆదాయాన్నివ్వాలి. చెల్లెలి పెళ్లి చేయాలి. వీలయితే, అమ్మా నాన్నలను తనుండే చోటుకు తీసుకుపోవాలి. అయితే యీ పనులేవీ, తనీ ఊళ్లో ఉండి చేయలేడు. ఈ దిక్కుమాలిన గూడెంలో అజ్ఞానం, దరిద్రం తప్ప మరేమీ లేవుకూడాను. ఏదో కాయకష్టం చేసుకొని బ్రతుకుదా మనుకొన్నా, సంవత్సరంలో సగంరోజులు

V. ARLA MEMORIAL LIBRARY
Acc. No. 11735

పొలంపనులే ఉండవు. పనిలేని రోజుల్లో బతికేందుకు మళ్లా రైతులమీదనే ఆధారపడాలి. తన కారణంగా ఊళ్లో ఇంత గందరగోళం జరిగినతరువాత, తనకు రైతులు సాయంచేస్తారను కోవడం కేవలమూ భ్రమ!

ఇవన్నీ తను ఆలోచించాడు. సుబ్బులుతోకూడా సంప్రదించాడు. దాని సమాధానం ఆకుకు అందకుండా పోకకు పొందకుండా ఉన్నది. చిన్నతనంనుండీ పుట్టిపెరిగిన, యీ పల్లెను వదలడం దానికిష్టం లేదు. అలాగని ఇక్కడి పరిస్థితులతో సరిపెట్టుకొని ఉండనూ లేదు. అందుకని అది గోడమీద పిల్లివాటంగా చెప్పుకొచ్చింది. అతితెలివైన ఘటం గనుక తన మనస్సులో ఏమున్నదో చెప్పలేదుగానీ, బస్తీలో కాపరంపెట్టాలని దానికీ ఉన్నది. అక్కడున్నన్ని సదుపాయాలు సౌఖ్యాలు ఇక్కడలేవు. బస్తీకెడితే అవన్నీ తమకూ అందుబాటులో ఉంటాయని దాని అభిప్రాయం. ఆ ముక్కయినా స్పష్టంగా అనదుగదా చచ్చి. ఏదో చూచాయగా అంటుంది. ఆ అన్నదాన్నిబట్టే, తను అసలు సంగతేమిటో గ్రహించుకొంటాడు. ఈ సాధకబాధకాలన్నీ తను బాగా ఆలోచించాకనే, బస్తీకెళ్లడానికి నిర్ణయించుకొన్నాడు. ముందుగా, మొత్తం సంసారాన్ని తీసుకెళ్లకూడదు. తను వెళ్లాలి. వెళ్లి ఏదన్నా ఉద్యోగం చూసుకోవాలి. కాస్త స్థిరపడిన తరువాత, సుబ్బుల్ని మిగిలినవాళ్లనూ తీసుకుపోవాలి.

ఈ నిర్ణయానికి తను వచ్చిననాడు, కంటిమీద కునుకేలేదు. తెల్లవార్లూ అటూ యిటూ మసులుతూనే ఉన్నాడు. అప్పటికీ సుబ్బులు వొకటి రెండు సార్లు సంగతేమిటంటూ

తనను అడిగింది. తనేమని చెబుతాడు? అథవా చెప్పినా దానికేపాటి అర్థమవుతాయి గనుక? నాన్ననడిగి ఓ పాతిక రూపాయలు తీసుకొని, తను గుంటూరు వచ్చాడు. గుంటూరు తనకు తెలియందికాదు. ఉన్నవవారికోసం, తను చాలాసార్లు వచ్చాడు. కవిరాజుకోసం, తెనాలి వెళ్లినప్పుడల్లా గుంటూరు మీదుగానే వెళ్లాడు. ఒకటి రెండు రోజులు ఉన్నవవారింట్లోనే ఉన్నాడు. ఆతరువాత ఉండేందుకు, తనకే మనసొప్పలేదు. అసలే వారిల్లు సత్రంలాగా ఉంటున్నది. వచ్చేవారికీ, పోయే వారికి తెరపేలేదు. పంతులుగారు బాగా ఉన్నవారేమో తనకు తెలీదు. కాని ఉన్నవారయితేమట్టుకు వృథాగా వొక మనిషిని ఎంత కాలమని పోషిస్తారు గనుక?

తను వారం పది రోజులపాటు కాలుకాలిన పిల్లిలాగా తిరిగాడు. ఆఖరుకు, అదేదో ఫ్యాక్టరీలో చిన్న పని దొరికింది. అలా దొరకడానికి ముందు, తను పడిన బాధలు ఆ భగవంతునికీ తనకూ తప్ప మరొకరికి తెలీవు. తను, వెంకటప్పయ్య గారికోసం చాలాసార్లు తిరిగాడు. వారుకూడా నలుగురైదుగురికి చెప్పారు. ఫ్యాక్టరీలో కూలిపనిక్కూడా తన కులం అడ్డం వచ్చింది. సవర్ణులైన కూలీలు తనతో కలిసి పనిచేయడానికి అభ్యంతరం చెప్పారు. కానీ, ఆ ఫ్యాక్టరీ యజమానికి, గాంధీగారంటే ఇష్టం గనుక, తనకీమాత్రమైనా ఉద్యోగం దొరికింది. ఉద్యోగానికే అన్ని గొడవలుపడితే—ఇక కొంప సంగతి? దానికోసం తను ఎక్కని గడపా, దిగని గడపా లేదు. చాలామంది ఇల్లు ఖాళీల్లేవన్నారు. ఉన్నవారు—హరిజనులకు ఇవ్వమన్నారు. ఇచ్చితీరాలనేందుకు ఎవరికి మాత్రం ఏం హక్కున్నది గనుక?

పగలల్లా పనిచేసి, రెండు మెతుకులు తిని, ఏ అరుగు మీదనో నిద్రపోయేవాడు. తన కులంపేరు దాచుకొని. ఆంజనేయస్వామి గుడిలో కొన్నిరోజులు పడుకొన్నాడు. రెండున్నర మాసాలపాటు, ఇల్లాగా జరిగినతరువాత, తన పేరు మస్తరులోకి ఎక్కింది. అంటే — తనకా ఉద్యోగం ఖాయమయిందన్నమాట. ఇక సుబ్బుల్ని తను తెచ్చుకోవచ్చు. కూలిపేటలోనే, ఓ పూరిల్లు అద్దెకు తీసుకొన్నాడు. నెలకు రూపాయి పావలా అద్దె. ఇంటికీ ఫ్యాక్టరీకి రెండు ఫర్లాంగుల కన్నా దూరంలేదు. ఫ్యాక్టరీ కూతవిని, తనింట్లో బయల్దేరినా వేళకు అందుకొంటాడు. అమ్మయ్య! ఎంత కాలానికి తనకీ స్థిమితం చిక్కిందో!

* * *

సుబ్బులుకు కొత్త ప్రపంచంలోకి అడుగుపెట్టినట్లు అనిపించింది. ఈ ప్రపంచానికీ, తను లోగడ జీవించిన ప్రపంచానికీ, ఎక్కడా పోలికలే లేవు! ఈ రెండింటినీ తావిళ్లు వేసి చూసుకొన్నప్పుడు, సుబ్బులుకు ఆశ్చర్యమూ, ఆనందమూకూడా కలిగాయి.

తను చిన్నతనంలో చూసిన నారాయణకూ, ఇప్పటి నారాయణకూ ఎంత భేదం ఉన్నది? నారాయణదంతా అదో ధోరణి! కాస్త ఆనందమొస్తే పట్టపగ్గా లుండవు. రవంత కాలు నొచ్చినా కన్నునొచ్చినా విలవిల లాడిపోతాడు. తనా—ఆ పల్లెల్ని వదిలి ఉండలేదు. అలాగని, అక్కడి వాతావరణాన్ని భరించనూలేను. అందుకని చాలా రోజులపాటు, తనో నిర్ణయానికి రాలేకపోయింది. ఆయన చదువుకొన్నాడు సరే

— మరి తనుకూడా అంతో ఇంతో చదువుకొన్నదే కదా! తన చదువంతా యీ నాలు గ్గోడల మధ్యా వృధాకావలసిందేనా?

అందుకనే ఆయనతో బాటు తనుకూడా వచ్చింది గుంటూరుకు. అంతకుముందు వొకటి రెండుసార్లు తను గుంటూరును చూసింది. అక్కడి దీపాలు, రోడ్లు, మేడలు, షాపులు చూసి తనకు తల తిరిగినంత పనయింది. ఆనాడు గానీ, ఆ తరువాతగానీ, తనొకనాటికి, యీ ఊళ్లోనే కాపరం పెట్టవలసి వస్తుందని అనుకోలేదు. అలాంటిది — తను కాపరం కూడా పెట్టింది.

ముందుగా గుంటూరు గురించి తను అనుకొన్న విషయాలు వేరు; తీరా ఇక్కడికొచ్చాక తను ఎదుర్కొంటున్న సమస్యలు వేరు. ఇవి తను ఊహించనివి! వీటినెలా పరిష్కరించాలో తనకు తొలిరోజుల్లో తెలీదు. ఆయనేమో ప్రొద్దుటే ఫ్యాక్టరీకెడతాడు. తిరిగిరావడం సాయంత్రానికే! పగలంతా వాళ్ళు హూనం హూనం చేసుకొని జోగులాడుతూ ఇంటికొస్తారాయన. రెండు చెంబుల నీళ్లుపోసుకొని, ఏ పచ్చడిమెతుకులో ఇన్ని నోట కుక్కుకొని, ఆదమరచి నిద్రపోతాడు. తామేదో సుఖపడి పోతున్నామని, ఊరివాళ్లనుకొంటుంటారు. మొన్న ముసలాయన వచ్చినప్పుడుకూడా అదే అన్నాడు. నాలుగు రోజులపాటు ఇక్కడ ఉండి, యీ పరిస్థితులన్నీ చూశాక ఆయనక్కూడా ఏమనడానికీ పాలుపోలేదు.

‘ఆ రొంపిలోనించి బైటపడినందుకు సంతోషించాలో, ఈ కొత్త రొంపిలోకి కూరుకు పోతున్నందుకు విచారించాలో, తెలియడంలే’ దన్నాడు నాన్న.

ఈ మధ్యనే బంగారమ్మ వచ్చింది. వచ్చిందంటే తనంతట తనుగా రాలేదు. ఈయన వెళ్లి తీసుకొచ్చాడు. బంగారమ్మొచ్చిన రెండు మాసాలు తిరక్కముందే ముసలమ్మా ముసలయ్యాకూడా వచ్చారు. వీళ్లిద్దర్నీ తనే తీసుకురమ్మన్నది. ఆయన ఊరినించి వచ్చేశాక, అక్కడ మళ్లా గొడవలు బయల్దేరాయట. పొలంలోకి రైతులెవ్వరూ రానివ్వడం లేదుట. పని పాటలకు పిలవడం లేదుట. ఏవో కుంటిసాకులు చెప్పి మనుషుల్ని చావ చితక బాదుతున్నారట. పశువుల్ని బందెలదొడ్డిలో ఉంచుతున్నారుట. ఎంతకాలమని, ఈ హింసలు భరించడం? అందుకని వాళ్లూ ఇక్కడికే వచ్చారు. వచ్చే నాలుగురాళ్లూ తమకే అస్తుబిస్తుగా ఉంటే, అదనంగా మరో ముగ్గురు ఇంటి కొచ్చారు. నిజానికి యీ బరువు తలకుమించినదే! అలాగని ఇది వదిలిపోయేదికూడా కాదు. అమ్మా నాన్నలకు తిండి పెట్టొద్దని తనుమాత్రం ఎలా చెబుతుంది? తనకూ అన్నలూ, తమ్ములూ ఉన్నారు. వాళ్లుకూడా ఇదే పద్ధతిని అవలంబిస్తే తన అయ్యా అమ్మల గతి ఏం కాను?

ఈ సమస్య కొక్కటే పరిష్కారం ఉన్నది. తనుకూడా ఏదన్నా పనిచెయ్యాలి. నాలుగురాళ్లు తెచ్చుకోవాలి. వేణ్ణీళ్లకు చన్నీళ్లు తోడయితే ఇంత కటకట అప్పుడుండదు. అయితే తనేమిటి చేయడం? ఇళ్లల్లో పనిమనిషిగా తను పనికిరాదు. కూలీనాలీ చేయడం, తొలినుండీ తనకు అలవాటు లేదు. అలవాటున్నా లేకపోయినా ముందు ఆయనగారే వొప్పుకోరు.

ఈ సాధకబాధకాలన్నీ తను ఆలోచించాకనే కుట్టుపని నేర్చుకోవడానికి నిర్ణయించుకొన్నది. తమ వీధికి ఎదురుగానే

దర్జీ ఉన్నాడు. అయిదారు మాసాలు నేర్చుకొంటేసరి—ఈ సంగతే ఆయనన్నడిగింది. ఏ గుణాన ఉన్నాడో మానవుడు—సంతోషంగా వొప్పుకొన్నాడు. పెందరాడే లేచి ఇంటి పనులన్నీ చేసుకొన్నాక, ఆయనటు ఫ్యాక్టరీకి వెళ్లగానే, తనిటు దర్జీ దగ్గరకొస్తుంది.

ఏ మాట కామాటే చెప్పుకోవాలి. సాంబయ్యకూడా చాలా మంచివాడు. నెమ్మదస్తుడు. ఎంతో వోర్పుగా తనకు అన్ని సంగతులూ చెబుతున్నాడు. ముందుగా కాజాలు తీయడంతో తను కుట్టుపని ప్రారంభించింది. జాకెట్లు బన్నీలు కుట్టడానికి అయిదారు మాసాలు పట్టింది. తనేదో ఊడబొడిచే తెలివితేటలున్న మనిషని కాదుగానీ, తను చాలా సులువుగానే యీ పని నేర్చుకొన్నది. కుట్టడానిదేముంది—బాగానే చాతనవు తనకు. ఎటొచ్చీ కత్తిరింపుల దగ్గరే కాస్త తికమకగా ఉన్నది. ఓసారి—ఓ కుర్రాడి నిక్కరు తను లంబుచేసి పారేసింది. మరొకరి బన్నీనుకు, చేతులు వంకరటింకరగా వచ్చాయి. ఇలాచేస్తే అవతలి ఖాతాదారులు ఊరుకొంటారా? తిరిగి బాగుచేసి ఇవ్వమనన్నా అడుగుతారు, లేదా కొత్తగుడ్డ కొని, తిరిగి కుట్టివ్వమనన్నా అడుగుతారు. ఒకసారి సాంబయ్య, పాపం తనమూలంగా రూపాయి పావలా నష్టపోయాడు. ఆ నష్టం తను ముదరా ఇస్తాననా్న, సాంబయ్య వొప్పుకోలేదు. ఇదంతా ఎప్పటి మాటో—

తనిప్పుడు బాగానే కుడుతున్నది. భగవంతుడి దయవల్ల తనకో పాతిక ముప్పయ్ ఖాతాలుకూడా ఉన్నాయి. ఏవో మీటింగులో, సమావేశాలో, జరుగుతున్నప్పుడల్లా తనకు చేతినిండా పనే! కాంగ్రెస్ జండాలు, టోపీలు, బానర్లు

తయారుచేసే పనంతా వెంకటప్పయ్యగారు తనకే ఇస్తున్నారు. అవసరమయినప్పుడు రోజు కూలీమీద మరొకరిద్దరికి తను, పనికూడా ఇస్తున్నది. తనుకూడా అంతో ఇంతో ఆర్జిస్తున్నది కనుకనే సంసారం సుఖంగా గడిచిపోతున్నది. మొదట్లో, మొరాయించినా బంగారమ్మకూడా ఇప్పుడిప్పుడు పనిలోనికి వొంగుతున్నది. దానిక్కూడా కత్తిరింపులూ గిత్తిరింపులూ వస్తే, ఏదో సరోసురోపడి ఇంకో మిషను కొనుక్కుంటే—ఇంకే బెడదా లేకుండా నిర్విచారంగా కాలం వెళ్లి మారిపోతుంది.

నాలుగు డబ్బులుండాలే గానీ, బంగారమ్మ పెళ్లి చేయడం ఎంత సేపు గనక?

*　　　*　　　*

ఏదో సామెత చెబుతారే—పులి కడుపున పులి పుడుతుందే గానీ, మేక పుడుతుందా అని! సుబ్బులు అచ్చంగా పులి పిల్ల లాంటిదే! అచ్చంగా వాళ్లయ్య పోలికలే దానివన్నీ. అతగాడూ అంతే! ఏదన్నావో పని ప్రారంభించకుండా ఉండాలే గానీ మొదలుపెట్టాడంటే దాని అమీ తుమీ తేల్చిగానీ వదలడు నరసయ్య. అప్పుడెప్పుడో మఠంలో స్వాములవారికీ నరసయ్య మామకూ తగాదా వచ్చింది. అందాకా, మామ కూడా మఠం బావిలోనుంచే నీళ్లు తీసుకుపోతూ వుండేవాడు. దాన్ని ఆసరాతీసుకొని ఆ స్వాములవారు 'మతంగితం' అనడం ప్రారంభించాడు. అప్పటికీ నరసయ్య ఊరుకొన్నాడు. ఊరు కొంటున్నాడు గదాని స్వాములవారు అత్తయ్యతో ఏదో సరాగం లాంటిది ప్రారంభించాడు. ఆ తరహా వ్యవహారం అత్తకు బొత్తిగా కిట్టదు. ఇంటికొచ్చి బుంగ పందిట్లో దింపేసి,

తను బావికి పోనని చెప్పింది. సంగతేమిటన్నాడు మామయ్య. గునిసిగునిసి అసలుసంగతి కాస్తా వెళ్లబెట్టింది. మామయ్య. వసికొయ్య తీసుకు బయలుదేరాడు. అత్తా సుబ్బులూ కలిసి పట్టుబలవంతాన మావను ఆపారు. అదే ఆఖరు ఆ బావికి నీళ్లకోసం పోవడం. అప్పటికప్పుడే వాములదొడ్లో గడ్డపలుగు నూ కేశాడు. అత్తనుపిలిచి మట్టితీసి పక్కన పొయ్యమన్నాడు. వారం రోజులకల్లా బావి తయారయింది. ఈ వారం రోజు లలో, మామయ్యావాళ్లూ కుంటనీళ్లే తాగారు. తెల్లారగట్ల లేచి, కావిడితీసుకొని జాముపొద్దెక్కేదాకా నీళ్లుమోసి, అప్పుడు ముఖం కడుక్కొనేవాడు మామయ్య.

అలాగే కుంట పూడికతీయించేటప్పుడు కూడా! రాత్రిం బవళ్లూ ఒక్కచేతిమీదుగా చెరువంత కుంటనూ పూడిక తీశాడు. ఆ మట్టినంతా నారుదిబ్బకింద పోశాడు. పొగనారు వేశాడు. నాలుగొందలకు అమ్ముకొన్నాడు. కర్రివాగుకు, నడుమెత్తున అడ్డుకట్టపోశాడు. కుంట నిండిందాకా కట్టను అలాగే ఉంచాడు. ఆ తరువాత తన్ని కూలగొట్టేశాడు-- కట్టను!

అదేం చిత్రమోగానీ, అన్ని పనులూ ఆయనకు అలాగే కలిసొచ్చేవి. ఎవ్వరికీ లొంగని పొగరుమోతు దున్నపోతు, ఆయన దగ్గరకొచ్చిన వారం రోజులకల్లా పిల్లిలా అయిపోయింది. మళ్లా వాళ్లలాగా వీళ్లలాగా ముగతాడు పొడిచేవాడా? మేతకూ కుడితికీ మాడ్చేవాడా? అదేం లేదే! ఆజానుబాహువులాంటి మనిషి! నల్లమద్దిమానులాగా నిగనిగలాడుతూ ఇంతెత్తున ఉండే వాడు. చేతులకు దండ కడియాలు, వెండిమురుగులు, గోవ తాడు, ఎడంకాలికి వీరరాఘవుల కడియం, ముక్కుకు బంగార

ప్పోస, ఇంత వెడల్పున తిరుచూర్ణం పెట్టుకొని, కిర్రుచెప్పు లేసుకొని, డొంకన నడుస్తూ ఉంటే, అత్తయ్య అంటున్నట్లుగా ఆకాశాన పక్షులుకూడా ఆశ్చర్యపోయేవి. ఇవన్నీ తనకు తెలీవుగానీ, నాన్న చాలా సంగతులు చెప్పుకొచ్చాడు. ఒకటి రెండు విషయాలు తనకూ తెలుసు. ఓసారి వాగులో బండి దిగబడిపోయింది. దాపఎద్దు ఫరవాలేదు గానీ, ఎలపటది ఎత్తుపడ్డది పాపం! అంతంతమాత్రం బరువైతే అదికూడా లాగి అవతల పడేసేదే. పధ్నాలుగు బస్తాల వేరుశనక్కాయలు, రెండు గడ్డిమోపులు, పైగా సుబ్బులు! ఇదీ బరువు! రోజా నిమిషనిమిషానికీ అడుసులోకి కూరుకుపోతూ ఉంది. ఎలప ఎద్దును విప్పేశాడు మామ. కాడి భూజాన వేసుకొన్నాడు. సుబ్బుల్ని దాపటదాన్ని అదిలించమన్నాడు. ఒక్క మూలుగు మూలిగి బండిని గట్టునపడేశాడు. తను--ఇదంతా నీలి తొట్టి మీద కూచుని చూస్తూనే ఉన్నాడు. అది మొండితనమో, మూర్ఖత్వమో, పట్టుదలో, ఏది అనండి—నరసయ్య మామలో ఆ లక్షణం ఉంది. ఆయన కూతురు గనక—సుబ్బుల్లోనూ ఆ లక్షణం ఉంది.

అది పట్టుపట్టిందంటే—అంతే—కాదనడం, లేదనడం వృధా. ముందుగా సరదా కోసమన్నది. ఆ తరువాత కాలక్షేపం కోస మన్నది. ఆ దరిమిలా, ఇంట్లో ఉండి చేసేదేమున్నదని నన్నూరికే కూచోమంటా వన్నది. తనకేదో సమాధానం చెప్పాలనే ఉంటుంది. కానీ—అదివేసే ప్రతి సవాళ్లకు తనకు చప్పున సమాధానం దొరికేదికాదు. తనకేమో ఈ వ్యవ హారాలంటే అంతగా గిట్టవు.

‘అలా కాదు. ఊరికే నచ్చవంటే ఏం లాభం? ఎందుకు నచ్చవో కూడా చెబితే బావుంటుంది’ అని నిగ్గదీసింది సుబ్బలోకసారి.

‘నీకు నచ్చచెప్పే అవసరం నాకేంలేదు సరా?’ అన్నాడు తను.

‘నాకున్నది. నే చెబుతాను వినుమరి.’

‘నీసొదంతా వినే తీరిక నాకులేదు’ అన్నాడు తను మొండిగా.

‘పోనీ నీకు తీరిగ్గా ఉన్నప్పుడే అడుగు. అప్పుడే చెబుతాను. ఈలోగా కొంపలు మునుగుకు పోయేవేమీ లేవు’ అన్నది సుబ్బులు.

‘అంతేగానీ నేను చెప్పినట్లు వినవన్నమాట?’

‘ఇదెక్కడి మేళమయ్యా స్వామీ! నీవు మంచి మాట చెప్పాలేగానీ, నేను వినకపోవడమంటూ ఉండదు. అదీగాక సొదంతా వినే తీరికలేనివాడివి—నాకెలా చెబుతావో చెప్పూ? దీనికిమాత్రం నీకు తీరికెక్కడిదీ?’ అన్నది సుబ్బులు.

‘నలుగురూ చూస్తే ఏమనుకొంటారో చెప్పూ?’ అన్నాడు తను కాస్త తగ్గి!

‘అదీ నువ్వే చెప్పూ?’ అన్నది సుబ్బులు మొండికెత్తిన దాని లాగా!

‘ఫలానా నారాయణ పెళ్లాం మిషను కుడుతున్నదనీ, ఆడదాని సంపాదనమీద, ఈ సన్నాసి కులుకుతున్నాడనీ అనుకోరంటే?’

'ఏం అనుకోంటే? మనమేమీ మహారాజులం కాదు. పల్లెలో ఉన్నప్పుడు కూలీనాలీ చేసుకొన్నాం. అప్పుడెప్పుడూ లేని సిగ్గు ఇప్పుడెందుకో నాకర్థంకాదు' అన్నది సుబ్బులు.

'ఇది బస్తీ సుబ్బులూ! అదీగాక అంతో ఇంతో నేను సంపాదిస్తూనే ఉంటిని! ఇది మనకు చాలకపోతే అప్పుడు చూసుకొందాం' అని భార్యకు నచ్చచెప్పడానికి ప్రయత్నించాడు తను.

'అవును గానీ! ఎల్లకాలం మనం ఇలాగే ఉంటామా? ఇక సంసారం పెరగదా? ఖర్చులు పెరగవా? ఓపిక ఉన్నప్పుడే నాలుగు రూపాయలు సంపాదించుకోడం తప్పని నాకు తెలియదే' అన్నది సుబ్బులు.

తను క్షణం ఆగాడు.

'సరేగానీ, బంగారమ్మ మెళ్లో ఏదో గొలుసు చూశాను. ఎక్కడిదే అది?' అన్నాడు తను.

'దాన్నే అడుగు'.

'అడిగాను. అదేమో వదిస్నడగ మన్నది. అది బంగారపుదేనటగా?'

'అవును'.

'ఎక్కడిదే అంత డబ్బు?' అన్నాడు తను నిజంగా ఆశ్చర్య పడి!

'నీ సంపాదనలోది మాత్రం కాదు. అదే పాపం రాత్రిం బవళ్లూ మెషీనుమీద పనిచేసి సంపాదించుకొంది. ఉంటే ఖర్చయిపోతుందని, నేనే వెళ్లి ఆ గొలుసు చేయించాను'.

'బాగానే ఉంది మేళం! సరే నీ ఇష్టంవచ్చినట్లు అఘోరించు అని తాత్కాలికంగా అస్త్ర సన్యాసం చేశాడు తను.

మొత్తానికి సుబ్బులు పంతమే నెగ్గింది. అదీ బంగారమ్మా, వాళ్లు దాచుకోకుండా పనిచేసేవారు. ఎడాపెడా సంపాదించే వారు. పది వాయిదాల్లో తీర్చుతామన్న మెషిన్ బాకీని, ఆ తరువాయి దాన్లోనే తీర్చేశారు. ఎలా సంసారం నెట్టు కొస్తున్నదో తనకైతే తెలీదు. కానీ తనకు మాత్రం ఏ లోటూలేదు. తను అనుభవించిన ఇబ్బందికూడా లేదు. ఎప్పుడన్నా తను ఖస్సుబుస్సుమంటే అమ్మా, నాన్నా తన మీదనే విరుచుకుపడేవారు. కోడల్ని వెనకేసుకు వచ్చే వారు. అదృష్టవశాత్తూ తనకు ఈ తగాదాలు లేవు. బంగా రమ్మ పెళ్లికూడా అయిందనిపిస్తే తనకింతట్లో సమస్యలంటూ ఉండవు. ఆ సంగతే తనోసారి సుబ్బులుతో ప్రస్తావించాడు.

'అదీ నిజమే' అన్నది సుబ్బులు.

'ఏదన్నా చెయ్యాలే' అన్నాడు తను.

'ఏదన్నా చెయ్యడం కాదయ్యా — బంగారమ్మకు పెళ్లి చెయ్యాలి'.

'అసలు నీ ఉద్దేశమేమిటే!' అన్నాడు తను.

'నేనే పెళ్లికొడుకునైతే బంగారమ్మను ఎగరేసుకుపోదును!' అన్నది సుబ్బులు నవ్వి.

'ఇప్పుడు మాత్రం నీకు తక్కువేమయిందే! బంగారమ్మకు బదులుగా దాని అన్నయ్యను ఎగరేసుకు పోయావుకదా?'

'నేనా? అవును పాపం! నీ అంత చక్కనయ్య దొరకడనీ' అన్నది సుబ్బులు నవ్వి.

'అబద్ధమాడబోకు సుబ్బులూ! మామిడితోపు దగ్గర, కాపలా కాసింది నేనా, నువ్వా? పరిగ కోసమని బుకాయించి తుమ్మల్లో కొచ్చింది నువ్వా నేనా?'

'ఇద్దరం వచ్చాం. లేకపోతే నే నక్కడికొచ్చినట్లు నీకు మాత్రం ఎలా తెలుస్తుంది? ... కాస్త నెమ్మదిగా మాట్లాడు. మన బండారం నలుగురూ వినక్కర్లేదు!'

'వింటే తప్పేమిటే?' అన్నాడు తను ఇంకాస్త బిగ్గరగా!

'తప్పు కాదు! బంగారమ్మ వింటే అదీ ఇలానే చేస్తుందేమో నని, నా బెంగ. అంతకన్నా మరేంలేదు' అన్నది సుబ్బులు.

'ఛా! అదుత్త పిచ్చి మాలోకమే!' అన్నాడు తను చెల్లెల్ని వెనకేసుకొస్తూ.

'ఎవరి పిల్ల వారికలానే ఉంటుంది. ఎవరో కన్నదాన్ని గనుక నన్ను తుమ్మల్లోకి తోపుల్లోకి రమ్మన్నావు' అని ఎత్తి పొడిచింది సుబ్బులు.

'నువ్వు రావడం మానేయక పోయావా మరి ... ?' అని దెప్పి పొడిచాడు తను.

మానేస్తే ఏం జరిగేదో సుబ్బులుకు తెలుసు. ఆ ప్రశ్నకు సమాధానంకూడా సుబ్బులుకు తెలుసు. ఆవిడ సమాధానం —రవంత ఘాటుగా చెబుదామనే అనుకొన్నది. అంతలోనే అక్కడికి బంగారమ్మొచ్చింది. సుబ్బులు సమాధానం చెప్పడం మానేసింది.

తనకు తెలీకుండానే సుబ్బులు చాలాచాలా ఘనకార్యాలు చేసినట్లు రుజువైననాడు తను దిమ్మరపోయాడు. అది బంగారమ్మకు సంబంధం మాట్లాడింది. ఆ సంబంధమైనా చాలా

కోలీ సంబంధం కాదు. రమణయ్య తండ్రి, పోలీసు డిపార్టు మెంటులో ఉద్యోగి. రమణయ్య ఎ.సి. కాలేజీలో చదివాడు. డిగ్రీ పుచ్చుకొన్నాడు. ఇంకా ఉద్యోగం దొరకలేదు.

'బాగానే ఉన్నాడే కుర్రాడు' అన్నాడు తను భార్యతో.

'మీ అన్నా చెల్లెళ్లకు నచ్చితే, అదే పదివేలు' అన్నది సుబ్బులు.

పెళ్లికి ముందే నాలుగైదు సార్లు నారాయణగారింటి కొచ్చాడు రమణయ్య. సరిగ్గా ఆ సమయంలోనే సుబ్బులు కేవో అర్జంటు పనులొచ్చి, ఆవిడ, ఇల్లొదిలి వెళ్లేది.

* * *

బంగారమ్మకూ, రమణయ్యకూ పెళ్లి జరిగింది. ఈ పెళ్లిని, గోపీచంద్ గారు, దగ్గరుండి జరిపించారు.

'నా పెళ్లి మీ నాన్నగారు చేశారు' అన్నాడు తను అప్పటి సంగతులను జ్ఞాపకం చేసుకొంటూ.

'ఆ లెఖ్ఖ ప్రకారం, నీ కొడుకు పెళ్లి నేను చేయాలని నీ అభిప్రాయం!' అన్నాడు గోపీచంద్, ఉంగరాల జుట్టు దిద్దు కొంటూ.

ఈ పెళ్లికి చాలా కొద్దిమందే వచ్చారు. ఫ్యాక్టరీ పనివారు, చందా లేసుకొని, బంగారమ్మకు వెండి కప్పూ, సాసరూ చదివించారు.

పీటలమీదినుండి లేవబోయే ముందు గోపీచంద్‌ను, నాలుగు ముక్కలు చెప్పమన్నారెవరో.

గోపీచంద్‌గారు ఓ క్షణం కళ్లు మూసుకొని మెల్లిగా చెప్పనారంభించారు.

'ఆలోచించి చూస్తూ ఉంటే—ఈ సృష్టిలోకల్లా విచిత్ర మైన ప్రాణి మానవుడే ననిపిస్తుంది. ఈ ప్రాణికి—ఇంకే ప్రాణికీ లేనంత స్వార్థం ఉంది! తన స్వార్థంకోసం ఈ ప్రాణి తనతోటి ప్రాణిని, సర్వనాశనం చేయడానికికూడా జంకదు. గతంలో జంకలేదు. వర్తమానంలో జంకడంలేదు. భవిష్యత్తు సంగతి చెప్పలేము.

'మనుషులందరూ వొక్కటేననే మన మతంకూడా, మను షుల్లో కొందరిని పురుగులకన్నా హీనంగా తయారుచేసింది. పురుగులను మనం ముట్టుకొంటాం. ఆవుల్ని, గేదెల్ని, మేకల్ని, గొర్రెల్ని, ఆఖరుకు కుక్కల్నికూడా మనం తాకుతాం. కానీ మనతోటి మనిషిని మాత్రం, మనం తాకం! ఇలా తాక్కూడదని, హిందూమతమే చెబుతున్న దంటారు కొందరు బుద్ధిజీవులు. కానీ ఆ మతమే 'మహాత్మా సర్వ భూతాత్మా,' అంటున్నదనీ చెబుతారు. ఈ రెండింటికీ నాకు పొంతన కుదరడంలేదు. ఈ దోషం మన మతంలోనే ఉన్నదా? మతవాదులమని చెప్పుకొంటున్నవారిలో ఉన్నదా!

'ఒకడు ఎక్కువ, ఒకడు తక్కువ—అన్నది స్వార్థపరుల కుట్ర. తక్కువ కులంవారూ, ఎక్కువ కులంవారూ, భగ వంతుని బిడ్డలే! ఈ సిద్ధాంతాన్ని మనం వొప్పుకొన్నప్పుడు, మనతోటి వారినే మనం అంటరాని వారుగా చూడడం అన్యాయం! లేక భగవంతుని సృష్టిలో, సహజంగానే ఈ భేదాలు ఉన్నాయంటారా? అలాంటి సృష్టిని చేసిన భగ

వంతుడు, నాకవసరం లేదు. మీకూ అవసరం లేదు. అసలెవ్వరికీ అవసరం లేదు! నా దృష్టిలో భగవంతుడు ఒక పెద్ద సోషలిస్టు! ఆయన ఇటువంటి పొరబాటు చేసి ఉండడు.

'ఆకలితో ఉన్నవాడికే అన్నం కావాలి. బాధలలో ఉన్నవాడికే భగవంతుడు కావాలి. గత చరిత్రను మనం పరిశీలించి చూస్తే, బాధితులందరూ—భగవంతునికి దూరంగా ఉంచబడ్డారు. వారిని అంటరానివారుగా ఎంచారు. దూరంగా ఉంచారు. వాళ్లూ, అజ్ఞానంలో, పేదరికంలో పురుగుల్లాగా యుగాలుగా బతికారు. ఇంకా బతుకుతున్నారు. వారి బతుకుల్ని చూసి, బాధపడే ఆర్ద్రత సంస్కారం, కూడా లేనంతగా మన గుండెలు చిట్టెం కట్టుకు పోయాయి.

'మన గుండెలమీద పేరుకుపోయిన ఈ చిట్టెం పెంకుల్ని కొంచెంగా రాలగొట్టారు గాంధీజీ! మునుపెన్నడూ లేనంతగా, ఈ అంటరాని వారికోసం, గాంధీజీ పాటుపడ్డారు. వారి బాధలను, కన్నీటి గాథలను అవగాహన చేసుకోవడం కోసం, వారి గుడిసెల్లో ఆయన మసిలాడు. శతాబ్దాల తరబడిగా, నిద్రపోతున్న ఈ అట్టడుగు జాతివారి వీపుతట్టి నిద్రలేపాడాయన. ఇప్పుడిప్పుడే ఈ జాతి మెలకువ తెచ్చుకొంటున్నది. ఇది శుభ సూచకం! వేలాది సంవత్సరాలపాటు ఈ మూగ జీవులకు, మనం చేసిన అన్యాయాలు అసంఖ్యాకంగా ఉన్నాయి. ఆ మహాపాపమంతా ఏకమయి, మొత్తం హిందూ మతాన్నే బూడిదపాలు చేయకముందే, ఈ అన్యాయాలకు అక్రమాలకు తగిన మూల్యాన్ని హిందూమతం చెల్లించవలసి ఉంది! కనీసం—

తన ఆత్మ రక్షణకోసమైనా వీరిని మానవులుగా, సాటివారుగా గుర్తించడం హిందూమతం నేర్చుకోవాలి.

'నగరాలలోనూ, పట్నాలలోనూ, ఇప్పుడిప్పుడే పరిస్థితులు కొద్దిగా మెరుగవుతున్నాయి. పల్లెటూళ్లల్లో — ఈనాటికీ ఎలాంటి చలనం లేదు. మార్పు అక్కడ రావాలి. అది రానంతకాలం, ఈ దేశానికి ముక్తిలేదు. మనిషిని మనిషిగా చూడడం నేర్పలేని మతం, ఉన్నా ఊడినా ఎవరుగానీ విచారించవలసిన పనిలేదు. నాకు మిత్రుడు నారాయణ చాలా కాలంగా తెలుసు! ఆయన బతికిన వాతావరణమూ తెలుసు. నారాయణ పెళ్లివల్ల, ఆ గ్రామంలో చెలరేగిన దుమారాన్ని గురించి, మా నాన్నగారు, తరచుగా చెబుతూ ఉండేవారు. ఏదో వొకనాటికి—అసంఖ్యాకులైన ఈ అంటరానివారి ఛత్రం క్రింద మొత్తం హిందూమతమే తన మనుగడ సాగించవలసిన సమయం వస్తుందని మా నాన్నగారు అంటూ ఉండేవారు. వారైనా, మన ధన ధాన్యాలనూ, సిరి సంపదలనూ అడగడం లేదు. తమనుకూడా మనుషులుగా చూడమని మాత్రమే ప్రాధేయపడుతున్నారు. దీనిని మనం ఖాతరు చేయనప్పుడు, రాగల ఫలితానికి, వారిని జవాబుదారీ చేయలేము'.

గోపీచంద్‌గారు తటుక్కున ఆగిపోయారు. ఆవరణ యావత్తూ నిశ్శబ్దంతో, నిశ్చేతనమయింది. గోపీచంద్‌గారు, ఉత్తరీయంతో, చెమట తుడుచుకొన్నారు. ఆయన కన్నులు ఎర్రగా ఉన్నాయి. ఆ ఎరుపును కప్పేందుకు నీటిపొరలు వృథా ప్రయత్నం చేస్తున్నాయి.

సుబ్బులు 'లేవ' మన్నట్టుగా సైగ చేసింది.

బంగారమ్మ రమణయ్య పీటలమీదినించి లేచారు.

చాలమంది సెలవు తీసుకొని వెళ్లిపోయారు.

తనుకూడా 'వెడతా' నన్నారు గోపీచంద్‌గారు.

'ఉండండి!' అన్నాడు తను.

గోపీచంద్ మాట్లాడలేదు.

'వెళ్లకండి. మనం మాట్లాడుకోవలసినవి చాలా ఉన్నాయి' అన్నాడు రమణయ్య.

ఆఖరుకు బంగారమ్మ సుబ్బులుకూడా ఉండమన్నారు.

'అలాగే' అన్నాడు గోపీచంద్, ఏదో ఆలోచిస్తూ.

వచ్చినవారి భోజనాలయ్యాయి. ఆ వేళకు చాలా కొద్ది మంది మాత్రమే ఉన్నారు. నారాయణ తండ్రి, అంత వయస్సులోనూ, ఏదో పనిచేస్తూనే ఉన్నాడు. నారాయణ తల్లి, లోపలినించి వెలుపలికి రాకుండా భోజనాలలోకి కావలసిన వాటినన్నిటినీ అందిస్తూ ఉంది!

'నేను చాలామందిని పిలిచాను. నలుగురైదుగురు తప్ప రాలేదండీ!' అన్నాడు తను నొచ్చుకుంటూ.

'రావడం ఇష్టంలేదేమో!' అన్నాడు రమణయ్య!

తను పలకలేదు.

'అనుమానం అవసరంలేదు రమణయ్యా! రావడం ఇష్టం లేకనే వారు రాలేదు. కానీ అలాగని వారు పైకి అనరు. సంఘ సంస్కారులమన్న కీర్తి వారికి కావాలి. సాంప్రదాయిక మైన ఆచారాలనూ పాటించాలి. నాకు తెలిసినవారిలో

చాలామంది — వేదికలమీద ఉపన్యాసాలు, బ్రహ్మాండంగా ఇస్తారు. కానీ, సచేల స్నానంచేసి గానీ మంచినీరు తాగరు' అన్నారు గోపీచంద్ గారు.

'అంటే వారంతా దొంగలన్నమాట!' అన్నాడు రమణయ్య.

'అదీ కాదు!' అన్నాడు గోపీచంద్ 'నిజమైన దొంగలతో మనకెప్పుడూ పేచీ లేదు. ఈ నిజాయితీలేని దొంగలతోనే మనకు పేచీ. వీరిని కనుక్కోవడమే కష్టం'

'మాటల్లోపడి మీరసలు తినడమే మానేశారు అన్నగారూ!' అన్నది సుబ్బులు.

'కాదు. మాటల మధ్యనయితే, మామూలుకన్న ఎక్కువ తింటారు. ఇప్పుడు నే నాపనే చేస్తున్నాను' అన్నారు గోపీచంద్ నవ్వుతూ!

ఈ మాటకు అందరూ నవ్వారు!

భోజనాలయ్యాక, అందరూ తుంగచాపలు పరుచుకు కూచున్నారు.

'మీ కథలు చాలా చదివాను' అన్నాడు రమణయ్య మెల్లిగా.

'మీరుకూడా రాస్తుంటారా?' అన్నాడు గోపీచంద్.

'లేదండీ!'

'రాయండి' అన్నాడు గోపీచంద్ ఉత్సాహంగా!

'మీ రేమీ అనుకోనంటే, కొన్ని విషయాలు మాట్లాడాలని ఉన్నదండీ!' అన్నాడు రమణయ్య నసుగుతూ.

'నేనేదో అనుకొనిపోతానని భయపడే వాడివి, నాతో నిర్భయంగా నువ్వేం మాట్లాడుతావు రమణయ్యా?' అన్నాడు గోపీచంద్ నవ్వి.

రమణయ్యకూడా నవ్వాడు.

ఓ నిమిషం తర్వాత, రమణయ్య గొంతు విప్పాడు—

'హరిజనుల్ని దేవాలయాలలోకి రానివ్వడంవల్లా, అంట రానితనం పాటించక పోవడంవల్లా, హరిజనుల సమస్యలన్నీ తీరతాయంటారా?' అన్నాడు రమణయ్య.

'ఏంచేస్తే తీరతాయంటారు?' అని ఎదురుప్రశ్న వేశాడు గోపీచంద్.

'వారికి ముందుగా తిండి కావాలి. ఉండడానికి, మంచి ఇళ్లు కావాలి. చదువుకొన్న వారికి ఉద్యోగాలు కావాలి. చదువు లేనివారికి భూములు కావాలి. ఆర్థికంగా ఎలాంటి లోటూ లేకపోతే, ఈ సమస్య స్వరూపం ఇంకోలాగా ఉంటుం దనుకొంటున్నాను' అన్నాడు రమణయ్య.

'నిజమే! ఎంత ఉన్నవాణ్ణయినా, డబ్బుకు సంబంధించి నంతవరకూ, ఆశ్రయిస్తారే తప్ప, కులం దగ్గర కొచ్చేసరికి, వంగతోట దగ్గర మామ సామెతే అవుతుంది. మీరంటున్నది రెండవ దశ! నేను మాట్లాడుతున్నది ప్రారంభ దశ! ముందు మనిషిని మనిషిగా చూడడం అలవాటు కావాలి. దేవాలయా లయాలలోకి, హరిజనులు రాకూడదంటున్న వారిలో, నూటికి తొంభై తొమ్మిదిమంది ఎప్పుడోగానీ, దేవాలయాల ముఖం చూడనివారే! వారు చూడకుండా ఎంతమంది గుళ్లల్లోకి పోయినా, వారికి అభ్యంతరం లేదు. కాని అదొక 'హక్కు'

కిందికొచ్చేసరికి వారు 'కాదు' అంటున్నారు. తిండిలేని వాణ్ని ముట్టుకొన్నా, వాణ్ని గుళ్లోకి రానిచ్చినా వాడికి వొరిగేదేమీలేదు'.

మధ్యలోనే రమణయ్య అందుకొని 'అదేనండీ నేనసేది' అన్నాడు ఉత్సాహంతో.

'నన్ను చెప్పనివ్వండి' అన్నాడు గోపీచంద్ నవ్వుతూ, 'అవన్నీ రావడానికి ప్రాతిపదికలాంటిదే ఈ ఉద్యమం. మేమూ మనుషులమేననీ, తామింత దౌర్భాగ్యస్థితిలోకి రావడానికి, ఈ మనుషులే కారణమనీ, హరిజనులు తెలుసుకొన్న రోజున—మిగిలిన మార్పులు వాటంతట అవే వస్తాయి. ఈ ఉద్యమాన్ని దెబ్బతీయడానికి, పరోక్షంగా కొన్ని ప్రయత్నాలు జరుగుతున్నాయి—అదీన్నీ తీవ్ర స్థాయిలోనే! 'అన్ని కులాలు సమానమే' అన్న వాదన వొకటి, 'అసలు కులాలే పోవాలి' అన్న వాదన మరొకటీనూ.'

'ఈ వాదనలు తప్పంటారా?' అన్నాడు రమణయ్య ఆశ్చర్యపోతూ.

'చెబుతాను' అంటూ ప్రారంభించాడు గోపీచంద్, 'ఒక రకంగా తప్పుకాదు. అందరూ, మానవులందరూ, వొకటే నన్న సిద్ధాంతంకన్న మంచిదాన్ని మనం ఊహించలేం. ఏ సిద్ధాంతమైనా, దాన్ని అమలుచేస్తున్న వారినిబట్టి ఆ సిద్ధాంతం మనకు ఉపకరిస్తుందా? అపకరిస్తుందా? అని మనం ఆలోచించాలి. హరిజనులకోసం జరుగుతున్న ఒక ఉద్యమాన్ని నీళ్లు గార్చడానికి—ఈ కొత్త వాదననే, స్వార్థపరులు ఆయుధంగా వాడుతున్నారు. అందరు మానవులు వొకటే గనుక, ప్రత్యేకంగా, హరిజనులకోసం ఏమీ చేయనవసరం లేదన్న వొక

భయంకరమైన ప్రమాదం, ఈ వాదనలో గర్భితమై ఉన్నది. ఇంతకాలంగా, నోరు మూసుకూర్చున్న ఈ కొత్త సంస్కర్త లందరూ ఇప్పుడే ఎందుకు నోరుపారేసుకొంటున్నారు? మొన్న మొన్నటిదాకా ఈ అలగా జనాన్ని, కుక్కలకన్నా, నక్కల కన్న హీనంగా చూసిన వర్గాలవారే, ఇంకో వేషంతో ఇప్పుడు ముందుకొస్తున్నారు. వచ్చి 'అందరం ఒకటే' నంటున్నారు. ఒకటే గనుక, ఈ హరిజనులకేమీ జరుగకూడదని, వారి అభిప్రాయం. ఒకవేళ ఏదన్నా జరిగినా, అది అందరికీ జరగాలని వీరి సిద్ధాంతం! 'వర్గాల మధ్యా, వర్ణాల మధ్యా, వ్యత్యాసం చూపుతున్నారహో' అని వీరు గొంతెత్తి అరచి, అల్లరి చేస్తున్నారు, ముందు ముందు ఇంకా ఇంకా చేస్తారు. ఇదో పద్ధతి! ఇవన్నీ ఎదుర్కోవలసిందే! తరాలుగా, యుగాలుగా హిందూ సమాజంలోని కొందరు అనుభవిస్తున్న కొన్ని ప్రత్యేక హక్కులకు ఇప్పుడు విచ్ఛిన్నం ప్రారంభమయింది. ఆ హక్కులను కాపాడుకోవడం కోసం, ఆ వర్గాలవారు, ఎన్ని వేషాలయినా వేస్తారు. ఆ వేషాలు చూసి మోసపోకూడదు. తిండీ గుడ్డా కావలసిందే! అందరూ సుఖంగా ఉండవలసిందే! అలాంటి సమాజం—సోషలిస్టు సమాజం—రావాలంటే కోట్ల సంఖ్యలో ఉన్న, ఈ అట్టడుగు ప్రజలవల్ల రావాలి గానీ, పై వర్గాల వారివల్ల రాదు' అన్నాడు గోపీచంద్.

తను వింటూ కూచున్నాడు. ఇంట్లోంచి గిన్నెల చప్పుడు వినిపిస్తూ ఉంది. పెట్రోమాక్సు దీపంలో గాలి తగ్గిపోయింది గావును — వత్తి ఎర్రగా మండుతోంది!

'కానీ గోపీచంద్‌గారూ! నాయకత్వం, ఈ బడుగు వర్గాల చేతుల్లో లేదుగదా మరి?' అన్నాడు రమణయ్య.

'నాయకత్వం ఒకరినించి మరొకరికి సంక్రమించదు. అలా సంక్రమించిన నాయకత్వం ఆట్టేకాలం ఉండదు. అది ఎవరికి వారు సంపాదించుకోవాలి. ఇప్పటి మన జాతీయోద్యమంలో, భారతీయ పెట్టుబడిదారీ వర్గాలున్నాయి. ఈ వర్గాలు, ఇంగ్లండులోని పెట్టుబడిదారులతో లాభాలకోసం పోటీపడు తున్నాయి. నన్ను అపార్థం చేసుకోనంటే చెబుతాను—విదేశీ వస్తు బహిష్కరణ అన్నది అందులో వొక భాగం! ఎక్కడో ఇంగ్లండులో ఉన్న పెట్టుబడిదారుడు, ఇక్కడి సంపదనంతా తింటున్నాడని, ఇక్కడి వాడిగోల. ఇంగ్లాండువాణ్ని వెళ్ల గొట్టేంతవరకూ, ఈ వర్గాలు జాతీయోద్యమానికి, అన్ని విధాలా సహాయపడతాయి. ఆ తరవాత, అధికారాన్ని చేజిక్కించుకొని, లాభాలన్నీ తామే పిండుకోవడానికి ప్రయ త్నిస్తాయి. అయితే ఈ పద్ధతి ఎక్కువకాలం సాగదు. జాతీయోద్యమం ద్వారా చైతన్యవంతమైన ప్రజ—దేశీయ పెట్టుబడిదారి వర్గాలకు వ్యతిరేకంగా తిరిగి పోరాటాలు జరుపు తుంది గానీ, నిద్రపోతూ కూచోదు. వీరిని నిద్రపుచ్చడానికి, ఈ వర్గాలు శతధా కృషిచేస్తాయి. వీరిని మేలుకొలుపడానికి, ఈ అట్టడుగు వర్గాలనుండి వచ్చినవారు, కృషిచేస్తారు. సిద్ధాంత పరంగానూ, అధికారపరంగానూ వాదోపవాదాలు, పోరా టాలు తీవ్రంగా జరుగుతాయి. ఆ తరువాత గానీ, మనం కలలుకంటున్న ఆ సోషలిస్టు సమాజం అవతరించదు. ఇదంతా భవిష్యత్తులో జరగవలసి ఉన్నది, తప్పకుండా జరుగుతుంది కూడాను' అన్నారు గోపీచంద్.

చాలా పొద్దుబోయి చంద్రోదయమయింది. తూరుపు ఆకాశం, తెలిరేకలను విప్పుకొంటున్నది.

సమాప్తం.

62

BCi

AVA10313110



అంతా ఒకటే—అనే భావన కేవలం నినాదంగానే మిగిలి పోతున్న ఈ రోజుల్లో...

'వేకువ' మేలుకొలుపు లాంటిది!

సమతాభావం మనలో కలగాలంటే సహృదయత, త్యాగశీలం మనకుండాలి. ఈ సుగుణ సంపత్తిగల సజీవపాత్రలు ఈ నవల్లో మనకు ప్రత్యక్షమై మన పాత్రను మరో సారి గుర్తుచేస్తాయి.

సమకాలీన సమాజంలో అసమానతలను నగ్నంగా చూపి కర్తవ్యాన్ని ప్రబోధించే నవల—వేకువ.

V.R. NARLA MEMORIAL LIBRARY
V.R. NARLA
D.P.R.I.
Acc. No.

VEKUVA
By Ravuri Bharadwaja
వెల : రూ. 2·50

మనసు ఫౌండేషన్ పుస్తకాల పరిశీలనాపట్టిక

| | |
|---|---|
| పుస్తకం సంఖ్య | AOUA103B110 |
| పుస్తకం పేరు | వేకువ |
| తారీఖు | 31 December 2025 |
| ముందు అట్ట | [illegible] |
| వెనుక అట్ట | [illegible] |
| మొత్తం పేజీలు | [illegible] 73 |
| పెద్ద సైజు పేజీలు | No |
| ఖాళీ పేజీలు | C, BC, 1, 2, 69 |
| లేని పేజీలు | No |
| తయారు చేసినది | Bhargavi |
| పేజీలు విడదీసినది | Lakshmi |
| స్కాన్ చేసినది | C Nageswari |
| పరీక్ష చేసినది | SARANYA |
| పేజీలు సరిచూసినది | |
| బైండింగు చేసినది | |
| ప్యాకింగు చేసినది | |
| పరిస్థితి | good |